అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
Follow: manasarkar
email: jobs@manasarkar.com



సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar


సంపుటి: 01 ::: సంచిక:111 | హైదరాబాద్ 22 నవంబర్ 2025, శనివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-111 | Hyderabad 22 November 2025, Saturday | Pages: 8, Rs. 5/-



అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
Follow: manasarkar
email: jobs@manasarkar.com


## పీపీపీ పద్ధతిలోనే మెడికల్ కాలేజీలు

**తేల్చి చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు**



ఐదు మెడికల్ కళాశాలల టెండర్ ప్రక్రియ వేగవంతం | ప్రతి మెడికల్ కాలేజీకి 50 ఎకరాలు | 70శాతం పడకలు పేదలకు ఉచితం | సంజీవని ప్రాజెక్టు దేశానికి మార్గదర్శకం

**వైసీపీ పాలనలో పూర్తి చేయగా మిగిలిన మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పర్యవేక్షణ, అజమాయిషీ ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా మెరుగైన సేవలు అందించేందుకు మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నట్టు సీఎం వెల్లడించారు. వైద్యారోగ్య శాఖపై సచివాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మెడికల్ కాలేజీల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్శల్ హెల్త్ స్కీంపై విస్తృతంగా చర్చించారు.**

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపడుతున్నప్పటికీ, మొత్తం పర్యవేక్షణ, అజమాయిషీ బాధ్యత ప్రభుత్వానిదే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పీపీపీ మోడల్ కింద మొదటి విడతగా ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందులలో మెడికల్ కాలేజీల నిర్మాణం జరుగుతుందని, అధికారులు సీఎంకు వివరించారు. టెండర్ ప్రక్రియలో ఇప్పటికే నాలుగు దశలు పూర్తి చేశామని, వచ్చే నెలాఖరుకల్లా టెండర్ ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఈ కళాశాలల నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరాల్లో మాత్రమే లభించే ఆధునిక వైద్య సదుపాయాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తుందని సీఎం చెప్పారు. ఒక్కో మెడికల్ కాలేజీకి 50 ఎకరాలు కేటాయించామని, అందులో 25 ఎకరాల్లో కాలేజీ, ఆస్పత్రి నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయమని వివరించారు. మిగిలిన 25 ఎకరాల్లో నర్సింగ్, పారామెడికల్, డెంటల్, ఆయుర్వేద, వెల్‌నెస్ సెంటర్, యోగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

...::: తరువాయి 6వ పేజీలో..




## సీఎం ఫ్యామిలీకి బెదిరింపు కాల్స్
## ఉలిక్కిపడ్డ ఏపీ

**కుప్పం (ఏడీఎన్ఎన్) :**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. "మేం త్యాగాలు చేస్తూనే ఉన్నాం. అనేక బెదిరింపులను ఎదుర్కొంటున్నాం. ఇప్పటికీ మాకు ముప్పు ఉంది. బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి," అని ఆమె వెల్లడించడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో శుక్రవారం జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగడం, అవరోధాలను అధిగమించడం వంటి అంశాలపై విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి తమ కుటుంబ భద్రత, గత రాజకీయ పరిణామాలపై చేసిన వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రజల కోసమే తమ కుటుంబం ఉందని, ప్రజాసేవ కోసం ఎన్నో త్యాగాలు చేశామని ఆమె చెప్పారు.

..::: తరువాయి 4వ పేజీలో..

## కాప్ 30 సదస్సులో ఫైర్




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

కాప్ 30 సదస్సులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బ్రెజిల్‌లోని బెలెమ్ నగరంలో నిర్వహిస్తున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో వాతావరణ చర్చలు నిర్వహిస్తున్న వేదికలోని ఒక పెవిలియన్‌లో, గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంతో వివిధ దేశాల ప్రతినిధి బృందాలు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అత్యవసర సహాయక బృందాలు రంగంలోకి దిగి వెంటనే మంటల్ని అదుపులోకి తీసుకొచ్చాయి. మంటలను ఆరు నిమిషాల్లో అదుపులోకి తీసుకొచ్చామని, అనారోగ్యానికి గురైన 13 మందికి చికిత్స అందించామని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అగ్ని ప్రమాదానికి కారణాలేంటో ఇప్పటివరకూ సమాచారం తెలియరాలేదు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్చలు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

...::: తరువాయి 3వ పేజీలో..



## క'ర్ణాటకం'పై మౌనమేల..?

**కృష్ణాజలాల పరిరక్షణపై 9 పేజీల లేఖ రాసిన మాజీ సీఎం**

ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వ వాదనలు బలహీనంగా ఉన్నాయని విమర్శ

ఆల్మట్టి ఎత్తు పెంపుపై సర్కార్‌ను నిలదీసిన జగన్

కృష్ణా జల వివాదాల 2వ ట్రైబ్యునల్ (కెడబ్ల్యూడీటీ–2) విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని సీఎం చంద్రబాబు నాయుడుకు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లేఖ రాశారు. కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలు కాపాడడంలో కూటమి ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధితో పని చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. కృష్ణా జలాల వివాదాల పరిష్కారం కోసం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాలపాత్ర సభ్యులుగా ఏర్పాటైన కృష్ణా జల వివాదాల 2వ ట్రైబ్యునల్ (కెడబ్ల్యూడీటీ–2) ఎదుట రాష్ట్ర ప్రభుత్వం చాలా పేలవమైన వాదనలు వినిపిస్తోందని లేఖలో పేర్కొన్నారు.

...::: తరువాయి 4వ పేజీలో..

## వందేళ్ల... ఆర్ఎస్ఎస్ 50
## భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం
## గుజరాత్ భూకంపంలో సంఘ్ విశ్వరూపం

**ప్రపంచం అబ్బురపడిన విపత్తు నిర్వహణ**



2001, జనవరి 26. యావత్ భారతదేశం తన 51వ గణతంత్ర దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా, దేశభక్తితో జరుపుకోవడానికి సిద్ధమవుతున్న సుదినం. పాఠశాలల్లో పిల్లలు జాతీయ జెండాను ఎగురవేయడానికి బారులు తీరారు. ఢిల్లీ రాజ్‌పథ్‌పై కవాతుకు సైన్యం సిద్ధమైంది. టీవీలలో దేశభక్తి గీతాలు మార్మోగుతున్నాయి. గుజరాత్‌లోని కచ్, భుజ్ ప్రాంతాలలో కూడా అదే ఉత్సాహం, అదే సందడి.
కానీ, సరిగ్గా ఉదయం 8 గంటల 46 నిమిషాలకు, విధి ఒక భయంకరమైన వక్రగతిని ప్రదర్శించింది. భూగర్భం నుంచి ఒక రాక్షస గర్జన వినిపించింది. భూమి కంపించింది. 7.7 రిక్టర్ స్కేలు తీవ్రతతో సంభవించిన ఆ పెను భూకంపం, కేవలం రెండు నిమిషాల వ్యవధిలో, గుజరాత్ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చివేసింది. భుజ్, అంజార్, భచావూ వంటి నగరాలు నేలమట్టమయ్యాయి. వేలాది భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. పాఠశాలలకు వెళ్లిన పిల్లలు, ఇళ్లలో ఉన్న కుటుంబాలు శిథిలాల కింద సమాధి అయ్యారు. 20 వేల మందికి పైగా మరణించారు, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. గణతంత్ర సంబరాలు, మృత్యు ఘంటికలుగా మారిపోయాయి.
ఆ భయానక క్షణాలలో, విద్యుత్ లేదు, కమ్యూనికేషన్ లేదు, రోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం కూడా, ఈ ఆకస్మిక విపత్తు ధాటికి స్తంభించిపోయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయమే కూలిపోయింది.

...::: తరువాయి 2వ పేజీలో..




## 'అల్ ఫలాహ్' పై సిట్

**న్యూ ఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఢిల్లీ ఎర్రకోట వద్ద ఈ నెల 10వ తేదీన జరిగిన ఉగ్ర పేలుడు ఘటనతో, అల్ ఫలాహ్ యూనివర్శిటీకి ఉన్న సంబంధాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించటానికి ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేసింది. ఈ యూనివర్శిటీకి చెందిన 10 మంది విద్యార్థులు, మాజీ ఉద్యోగులు కనిపించకపోవడం, పేలుడు తర్వాత వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ లో ఉండటం, కారులో ఉన్న వ్యక్తి కూడా అదే యూనివర్శిటీ ఉద్యోగి అనే విషయం నిర్ధారణ కావడంతో, ఈ యూనివర్సిటీపై అనుమానాలు బలపడ్డాయి. ఇది ప్రణాళికాబద్ధమైన ఉగ్రవాద చర్య కావచ్చునని, సూసైడ్ బాంబింగ్ జరిగి ఉండవచ్చునని ప్రాథమిక దర్యాప్తు సూచించింది. ఇప్పటికే ఈ యూనివర్శిటీలో పనిచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమర్ నబీతో పాటు మరో ఇద్దరు ప్రొఫెసర్లు షాహీన్ షాహిద్, ముజమ్మిల్ గనైలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

...::: తరువాయి 2వ పేజీలో..




## గంభీర్‌కు ఊరట

**న్యూ ఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కరోనా మహమ్మారి రెండో దశలో అనుమతి లేకుండా కోవిడ్ మందులు నిల్వ చేసి పంపిణీ చేశారన్న ఆరోపణలపై గౌతమ్ గంభీర్ ఫౌండేషన్‌పై నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నాయకత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. గంభీర్ ఫౌండేషన్, గౌతమ్ గంభీర్, అతని కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించిన ఢిల్లీ హైకోర్టు, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేస్తున్నట్లు తీర్పు చెప్పింది.

...::: తరువాయి 2వ పేజీలో..

## తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల వేళ...
## ఐపీఎస్‌ల బదిలీలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 32 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీజీ పర్సనల్‌గా చౌహాన్, సీఐడీ డీఐజీగా పరిమిళా నూతన్, మహేశ్వరం డీసీపీగా నారాయణ రెడ్డి, తెలంగాణ నార్కొటిక్స్ ఎస్పీగా పద్మ, నాగర్ కర్నూలు ఎస్పీగా సంగ్రామ్ సింగ్ పాటిల్, సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ కారే, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, అసిఫాబాద్ ఎస్పీగా నిఖితాపంత్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ ఎస్పీగా వైభవ్ గైక్వాడ్, ములుగు ఎస్పీగా సుధీర్, భూపాలపల్లి ఎస్పీగా సంకేత్, వనపర్తి ఎస్పీగా సునీత, మల్కాజిగిరి డీసీపీగా శ్రీధర్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## విజయ్.. కొన్నాళ్లాగు..

**దళపతి టూర్ కు తమిళనాడు పోలీసుల బ్రేక్..**

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

టీవీకే పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ తమిళ నటుడు విజయ్ ప్రచార సభకు తమిళనాడు పోలీసులు బ్రేక్ వేశారు. డిసెంబర్ 4న సేలంలో టీవీకే పార్టీ ప్రచార సభ కోసం చేసిన దరఖాస్తును అంగీకరించలేదు పోలీసులు. ఇటీవల కరూర్ దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో విజయ్ ప్రచార సమావేశాలకు అనుమతి కోరేటట్లయితే, కార్యక్రమం నిర్వహించే తేదీకి నాలుగా వారాల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ శాఖ సూచించింది. భద్రతా సమస్యల కారణంగా అనుమతి ఇవ్వలేమని పోలీసులు పేర్కొన్నారు. ఇతర తేదీలలో ప్రచారానికి మళ్లీ దరఖాస్తు చేసుకుంటామని పార్టీ వర్గాలు తెలిపాయి. సేలం తర్వాత కృష్ణగిరి, ఈరోడ్, ధర్మపురి జిల్లాలలో కూడా ప్రచారం కోసం విజయ్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని, త్వరలోనే మళ్లీ ప్రజల ముందుకు వస్తారని తెలిపారు.



## బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం

**సీఐడీ విచారణకు హాజరైన నిధి అగర్వాల్, శ్రీముఖి**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బెట్టింగ్ యాప్స్ కు ప్రచారం చేసిన వ్యవహారంలో ప్రముఖ సినీ తారలు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి సీఐడీ అధికారుల ఎదుట శుక్రవారం విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలలో భాగంగా ప్రముఖులను వరుసగా విచారిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నటులు విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ ముగ్గురు తారలను విచారణకు పిలిచారు. సీఐడీ కార్యాలయంలో వీరి నుంచి అధికారులు, పలు వివరాలు సేకరించారు. శ్రీముఖి జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేసినట్లు, అమృతా చౌదరి పలు బెట్టింగ్ యాప్స్ కు ప్రచారం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిధి అగర్వాల్ సోషల్ మీడియా ద్వారా ప్రచారంలో పాల్గొన్నారనే అంశంపై కూడా సీఐడీ వివరాలు సేకరిస్తోంది.




## ఐదు లక్షల కోట్ల భూ కుంభకోణం

**9,292 ఎకరాల భూమిపై కన్ను**

**క్యాబినెట్ మీటింగ్‌లో బయటపడ్డ బ్లూప్రింట్**

**టీఎస్ఐపాస్ అవినీతి కోసమేనా?**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లో పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ పేరిట రూ.5 లక్షల కోట్ల కుంభకోణానికి ప్రభుత్వం పాల్పడుతోంది. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద భూ కుంభకోణం," అని ఆరోపించారు. మొత్తం 9,292 ఎకరాల విలువైన పారిశ్రామిక భూములను ప్రభుత్వం అత్యంత తగ్గింపు ధరకు రెగ్యులరైజ్ చేసేందుకు ప్రయత్నిస్తోందని కూడా, ఆయన లెక్కలతో సహా బయటపెట్టారు.

...::: తరువాయి 5వ పేజీలో..



## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..
## భారీగా రూపాయి పతనం

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ముగిశాయి. రెండు రోజుల వరుస లాభాల తర్వాత, ఈ నష్టాలు రావడంతో పాటు. రూపాయి విలువ భారీగా పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు, స్టాక్ మార్కెట్ సూచీలపై ప్రభావం చూపాయి. దీనితో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా రూ.89కి చేరింది. ఒక్కరోజులోనే 87 పైసలు బలహీన పడింది. మరోవైపు డాలర్ క్రమంగా బలపడుతోంది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, బజాజ్ ఫైనాన్స్, హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ రోజు ముగిసేసరికి 400 పాయింట్ల నష్టంతో ఉండగా, నిఫ్టీ సైతం 124 పాయింట్ల నష్టంతో ముగిసింది. మారుతీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్ వంటి షేర్లు లాభపడ్డాయి.

## ఎయిర్ షోలో అపశృతి

**దుబాయ్‌లో ఐఏఎఫ్ పైలెట్ దుర్మరణం**



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దుబాయ్ ఎయిర్ షో లో భారత వాయుసేనకు చెందిన విమానం శుక్రవారం కూప్పకూలింది. ఐఏఎఫ్ కు చెందిన తేజస్ యుద్ధ విమానం ప్రదర్శన ఇస్తుండగా, ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పైలట్ మృతి చెందినట్లు 'ఎక్స్' వేదికగా భారత వాయుసేన ఒక ప్రకటన విడుదల చేసింది. పైలట్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఐఏఎఫ్ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలపై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు ఐఏఎఫ్ పేర్కొంది. ప్రపంచంలోని అతిపెద్ద ఏవియేషన్ ప్రదర్శనలలో ఒకటైన దుబాయ్ ఎయిర్ షోలో ఏరియల్ డిస్‌ప్లే ఇస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. తేజస్ యుద్ధ విమానానికి సంబంధించి ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం.

...::: తరువాయి 3వ పేజీలో..



## జప్తు చేస్తే రచ్చ చేస్తా..

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో తన ఆస్తులతో పాటు, కుటుంబ ఆస్తులను కూడా జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేస్తూ, ఒక్క రూపాయి కూడా మద్యం వ్యాపారం ద్వారా సంపాదించలేదని పేర్కొన్నారు. విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణ జరిగిన సందర్భంగా చెవిరెడ్డి, శుక్రవారం తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "నాకు లిక్కర్ వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేదు. నేను సంపాదించిందంతా రియల్ ఎస్టేట్ ద్వారానే. కష్టపడి కూడబెట్టిన నా ఆస్తులను, లిక్కర్ వ్యాపారంతో అనుసంధానం చేయడం తీవ్ర బాధను కలిగిస్తోంది. వందల ఏళ్లుగా మా కుటుంబానికి సంక్రమించిన వారసత్వ ఆస్తులను జప్తు చేయడం అన్యాయం," అని ఆయన వ్యాఖ్యానించారు.

...::: తరువాయి 6వ పేజీలో..

## ఆ సిఐ డిస్మిస్...



**కడప (ఏడీఎన్ఎన్) :**

పులివెందుల మాజీ సీఐ శంకరయ్యను సర్వీసు నుంచి తొలగిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, శంకరయ్య ఇటీవల లీగల్ నోటీసు పంపడం రాజకీయంగా, పరిపాలనా వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. సీఎం తనపై చేసిన వ్యాఖ్యలు పరువునష్టం కలిగించాయని ఆ నోటీసులో శంకరయ్య పేర్కొన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో శంకరయ్య పులివెందుల సీఐగా పనిచేసిన విషయం తెలిసిందే.

# గంభీర్‌కు ఊరట

**మొదటిపేజీ తరువాయి....**

పిటిషనర్లు తమ వాదనలో, కరోనా తీవ్రత అత్యధికంగా ఉన్న సమయంలో అధీకృత డీలర్ల నుంచే మందులు కొనుగోలు చేసి, మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఇది పూర్తిగా సేవా కార్యక్రమమే తప్ప ఎలాంటి లాభాపేక్ష లేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, డ్రగ్స్ కంట్రోల్ శాఖ విచారణ ఆధారంగా ఫౌండేషన్‌పై కేసు నమోదు చేశారు. లైసెన్సు లేకుండా ఫావిపిరవిర్ (ఫాబిఫ్లూ) వంటి మందులను నిల్వ చేయడం ద్వారా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ఉల్లంఘన జరిగిందని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. దీంతో కింది కోర్టు గంభీర్ మరియు ఆయన కుటుంబ సభ్యులకు సమన్లు జారీ చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలైన ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ హుస్సేన్‌లకు కూడా ఊరట లభించే అవకాశముందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# 'అల్ ఫలాహ్' పై సిట్

**మొదటిపేజీ తరువాయి...**

తాజాగా ఒక క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. క్యాబ్ డ్రైవర్ ఇంటి నుండి పేలుడు పదార్థాలకు ఉపయోగించిన గ్రైండింగ్ మిషన్, ఎలక్ట్రానిక్ డివైజ్ లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ కలిసి కొందరు విద్యార్థులకు సిమ్ కార్డులు అందించారని సిట్ అనుమానిస్తోంది. డాక్టర్ గనై, క్యాబ్ డ్రైవర్ కొడుకుపై వేడి పాలు పడి కాలిన గాయాలకు చికిత్స చేశాడని, దీనితో వారిద్దరి మధ్య అనుబంధం ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు. అయితే మసీదులోని మతాధికారికి సంబంధం లేదని కుటుంబీకులు వాదిస్తున్నారు. కానీ బాంబు దాడికి కారణమైన ఉమర్ నబీ ఈ మసీదుకు తరచూ ప్రార్థనలకు వచ్చేవారని దర్యాప్తులో తేలింది. పేలుడుకు ముందు ఉమర్ మసీదులో సమావేశం జరిపాడా అనే కోణంలో విచారిస్తున్నారు. దేశ రాజధానిలో రెడ్ ఫోర్ట్ వంటి శక్తిమంతమైన భద్రతా కేంద్రం సమీపంలో ప్రజా రద్దీ ప్రాంతంలో జరగడం వల్ల, భద్రతా వ్యవస్థలపై పెద్ద ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



## హోంశాఖను
# త్యాగం చేసిన నితీష్

**పాట్నా (ఏడీఎన్ఎన్) :**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన ఎన్డీఏ కూటమి కొత్త ప్రభుత్వ ఏర్పాటును పూర్తి చేసింది. జేడీయూ నేత నితీష్ కుమార్ పదవీకాలంలో పదోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నితీష్‌తో పాటు మొత్తం 27 మంది మంత్రులు కూడా పదవీబాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ కేబినెట్‌లో కీలకమైన మార్పు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. రెండు దశాబ్దాల పాటు తన ఆధీనంలో ఉంచుకున్న హోంమంత్రి శాఖను నితీష్ కుమార్ ఈసారి బీజేపీకి అప్పగించారు. దీంతో కూటమి ప్రభుత్వంలో బీజేపీ పట్టు మరింత బలపడుతుందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. హోంమంత్రి శాఖను బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరికి కేటాయించడం ఈ ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన పరిణామంగా నిలిచింది. నితీష్ కుమార్ డిప్యూటీలలో మరో నేత విజయ్ కుమార్ సిన్హాకు గనులు-భూగర్భ శాస్త్ర శాఖతో పాటు భూమి మరియు రెవెన్యూ శాఖల బాధ్యతలు అప్పగించారు. మంగళ్ పాండే ఆరోగ్యం, న్యాయ శాఖలకు మంత్రి అయ్యారు. పరిశ్రమల శాఖను దిలీప్ జైస్వాల్‌కి అప్పగించారు. కొత్త ప్రభుత్వంలో చోటుచేసుకున్న ఈ పోర్టుఫోలియో మార్పులు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణలకు దారి తీసే అవకాశం ఉందని కనిపిస్తుంది.

# సొంత వదిననే పెళ్లాడాడు

**లక్నో (ఏడీఎన్ఎన్) :**

ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో చోటుచేసుకున్న అరుదైన వివాహం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. అనుకోని ప్రమాదంలో భర్తను కోల్పోయిన యువతికి మరో జీవితాన్ని అందించేందుకు ఆమె మరిది ముందుకు రావడం స్థానికులతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ ప్రశంసలు అందుకుంటోంది. కుటుంబ సమ్మతితో జరిగిన ఈ వివాహం అక్కడి ప్రజలను ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే, యూపీకి చెందిన రాజేశ్ సింగ్ సోదరుడు ఇటీవల జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ముఖ్యంగా తన సోదరుడితో ఎంతో అన్యోన్యంగా జీవించిన వదిన ఆవేదనను రాజేశ్ దగ్గరగా గమనించాడు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన ఆమె పరిస్థితి అతడిని మరింత ఆలోచింపజేసింది. కుటుంబానికి, వదినకు ఒక బలమైన అండగా నిలవాలన్న సంకల్పంతో రాజేశ్ ఓ నిర్ణయం తీసుకున్నాడు. వదినను పెళ్లి చేసుకోవడం ద్వారా ఆమెకు కొత్త జీవితాన్ని ఇవ్వాలని భావించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి, వారిని ఒప్పించడంతో పాటు బంధువుల సమక్షంలో సాదాసీదాగా వివాహం నిర్వహించారు. రాజేశ్ తన వదిన మెడలో మూడు ముళ్లు వేసి ఆమెను జీవిత భాగస్వామిగా స్వీకరించాడు.ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవగా, నెటిజన్లు రాజేశ్ నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు. కష్టకాలంలో కుటుంబాన్ని అండగా నిలబెట్టిన అతడి చర్య నిజమైన మానవత్వానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ అంతటా చర్చనీయాంశంగా మారింది.

# హీరా గ్రూప్ ఆస్తులు వేలం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హీరా గోల్డ్ సీఈఓ నౌహీరా షేక్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) భారీ షాక్ ఇచ్చింది. సంస్థకు చెందిన ముఖ్యమైన ఆస్తులపై వేలం ప్రక్రియను ప్రారంభించింది. ఈ వేలం ద్వారా సుమారు రూ.93.63 కోట్లు వసూలు అవుతాయని ఈడీ అంచనా వేస్తోంది. ఇప్పటి వరకు మొత్తం రూ.428 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సంస్థకు చెందిన ఒక స్థిరాస్తిని రూ.19.64 కోట్లకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత , మిగతా ఆస్తుల వేలం ప్రక్రియను వేగవంతం చేసింది. ఈడీ అధికారులు వెల్లడించిన వివరాలప్రకారం, వేలం ద్వారా వచ్చిన సొమ్మును హీరా గోల్డ్ మోసానికి గురైన బాధితులకు పరిహారంగా చెల్లించనున్నారు. గోల్డ్ డిపాజిట్ పేరుతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది కస్టమర్ల నుంచి హీరా గ్రూప్ భారీగా సొమ్ము సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. మొత్తం రూ.5,900 కోట్లు ప్రజల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసకేసు నేపథ్యంలో హీరా గ్రూప్‌పై దేశవ్యాప్తంగా 52 కేసులు నమోదయ్యాయి. సంస్థ ఆస్తులను ప్రభుత్వం ఇప్పటికే జప్తు చేసింది. ఇప్పుడు వేలం పాటల ద్వారా రికవరీ అయిన మొత్తాన్ని క్రమంగా బాధితులకు అందించే చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ చర్యలతో వేలాదిమంది బాధితులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# గుజరాత్ భూకంపంలో సంఘ్ విశ్వరూపం



**మొదటి పేజీ తరువాయి...**

బాధితుల ఆర్తనాదాలు తప్ప మరేమీ వినిపించని ఆ శూన్యంలో, ఆ అంధకారంలో, శిథిలాల మధ్య నుంచి, దైవదూతల్లా, ఆపద్బాంధవుల్లా ఒక సైన్యం ఉద్భవించింది. వారి చేతిలో ఆయుధాలు లేవు, కేవలం సేవా పరికరాలు ఉన్నాయి. వారి నడుముకు ఖాకీ నిక్కర్లు, మనసులో అంతులేని ధైర్యం ఉన్నాయి. వారే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) స్వయంసేవకులు.

ప్రభుత్వం తేరుకుని, సహాయక చర్యలు ప్రారంభించడానికి ముందే, భూకంపం వచ్చిన గంటల వ్యవధిలోనే, వేలాది మంది స్వయంసేవకులు రంగంలోకి దిగారు. వారు చేసిన ఆపరేషన్, కేవలం ఒక సహాయక చర్య కాదు. అది ఆధునిక భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రభుత్వేతర సేవా ఆపరేషన్ (Largest NonGovernmental Relief Operation). ఇది కేవలం భవనాలను బాగుచేయడం కాదు, ఇది కుప్పకూలిన జాతి మనోస్థైర్యాన్ని తిరిగి నిలబెట్టడం. సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ అందించిన 'సంఘటిత శక్తి', శ్రీ గురూజీ ప్రబోధించిన 'సేవా ధర్మం', సేవా భారతి వంటి సంస్థల వ్యవస్థాగత నిర్మాణం - ఇవన్నీ కలిసి, కచ్ ఎడారిలో సేవా గంగను ఎలా ప్రవహింపజేశాయో, ప్రపంచమే అబ్బురపడేలా విపత్తు నిర్వహణను (Disaster Management) ఎలా చేపట్టాయో చెప్పే అద్భుత గాథ ఇది. ఇందులో, ఆ విషాదం నుంచి ఆశ వైపు సాగిన ఆ మహత్తర సేవా యజ్ఞాన్ని సమగ్రంగా విశ్లేషించుకుందాం.

**ప్రథమ స్పందన (First Responders) – గంటల వ్యవధిలో అద్భుతం**

ఏ విపత్తులోనైనా, మొదటి కొన్ని గంటలు (Golden Hours) అత్యంత కీలకమైనవి. శిథిలాల కింద చిక్కుకున్న ప్రాణాలను కాపాడాలంటే, క్షణం కూడా ఆలస్యం చేయకూడదు. ఈ విషయంలో, సంఘ్ చూపిన వేగం, స్పందన, ఏ ఆధునిక విపత్తు నిర్వహణ సంస్థకైనా పాఠం చెప్పేంతటి గొప్పవి.

**గణతంత్ర పరేడ్ నుంచి సేవా రంగానికి:**

భూకంపం సంభవించినప్పుడు, గుజరాత్‌లోని అనేక ప్రాంతాలలో సంఘ శాఖలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. భూమి కంపించి, విధ్వంసం జరగగానే, ఏ ఆదేశాల కోసం ఎదురుచూడకుండా, ఆయా శాఖల ముఖ్య శిక్షక్ (Chief Instructor)లు తక్షణ నిర్ణయం తీసుకున్నారు. "ఇక పరేడ్ కాదు, ప్రాణ రక్షణ ముఖ్యం" అని నిర్ణయించి, స్వయంసేవకులందరినీ తక్షణమే సహాయక చర్యలకు మళ్లించారు.

- **అహ్మదాబాద్‌లో:** భూకంపం వచ్చిన 30 నిమిషాల్లోనే, సంఘ కార్యాలయం (డాక్టర్ హెడ్గేవార్ భవన్) ఒక కంట్రోల్ రూమ్‌గా మారిపోయింది. రక్తదానం కోసం పిలుపునిచ్చారు. శిథిలాల తొలగింపుకు బృందాలు బయలుదేరాయి.
- **భుజ్‌లో:** విధ్వంస కేంద్రమైన భుజ్‌లో, స్థానిక స్వయంసేవకులు, తమ సొంత ఇళ్లు కూలిపోయినా, తమ కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్నా, ఆ దుఃఖాన్ని దిగమింగి, ఇతరులను కాపాడటానికి పరుగు తీశారు.

ప్రాణ రక్షణే పరమావధి:

**మొదటి 48 గంటలు, స్వయంసేవకులు తిండి, నిద్ర లేకుండా పనిచేశారు.**

- **భారీ క్రేన్లు,** యంత్రాలు ఇంకా చేరుకోని సమయంలో, వారు తమ ఒట్టి చేతులతో, గడ్డపారలతో కాంక్రీట్ దిమ్మలను తొలగించారు.
- **ఇరుకైన** సందులలోకి, ప్రమాదకరంగా వేలాడుతున్న భవనాలలోకి దూరి, ప్రాణాలతో ఉన్నవారిని భుజాలపై మోసుకుని బయటకు తెచ్చారు.
- **ఒక సంఘటనలో,** అంజార్‌లో గణతంత్ర వేడుకలకు వెళ్తున్న 400 మంది స్కూల్ పిల్లలు, ఇరుకైన సందులో ఇరుక్కుని, ఇళ్లు కూలి మరణించారు. ఆ చిన్నారుల మృతదేహాలను వెలికితీయడం, వారి తల్లిదండ్రులకు అప్పగించడం వంటి హృదయవిదారకమైన పనులను స్వయంసేవకులు కన్నీళ్లతో, కానీ గుండె నిబ్బరంతో చేశారు. ప్రభుత్వ సిబ్బంది కూడా జుగుప్సతో, భయంతో వెనకడుగు వేసిన చోట, స్వయంసేవకులు "మానవ సేవే మాధవ సేవ" అని ముందడుగు వేశారు.

**రక్తదానం – ప్రాణదానం:**

ఆసుపత్రులు క్షతగాత్రులతో నిండిపోయాయి. రక్తం కొరత తీవ్రంగా ఉంది. సంఘ్ పిలుపుతో, గుజరాత్, మహారాష్ట్రల నుంచి వేలాది మంది యువకులు రక్తదానం చేయడానికి క్యూ కట్టారు. ఒక్క రోజులోనే వేల యూనిట్ల రక్తం సేకరించబడింది. ఇది వందలాది మంది ప్రాణాలను కాపాడింది.

ఈ 'ప్రథమ స్పందన' ఎంత వేగంగా జరిగిందంటే, ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్, మరియు కేంద్ర హోం మంత్రి ఎల్.కె. అద్వానీ (ఆయన స్వయంగా గాంధీనగర్ ఎంపీ) సంఘటిత శక్తిని చూసి ఆశ్చర్యపోయారు. సైన్యం చేరుకునే లోపే, సంఘ్ సగం పనిని పూర్తి చేసింది.

**వ్యవస్థీకృత సేవ – విపత్తు నిర్వహణలో ఒక నమూనా**

కేవలం ఆవేశంతో, భావోద్వేగంతో చేసే సేవ ఎక్కువ కాలం నిలబడదు. దానికి ఒక పటిష్టమైన 'వ్యవస్థ' (System), 'నిర్వహణ' (Management) అవసరం. గుజరాత్ భూకంపం సందర్భంగా సంఘ్ ప్రదర్శించిన మేనేజ్‌మెంట్ స్కిల్స్, ప్రపంచంలోని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలను సైతం ఆకర్షించాయి. ఇది కేవలం గుంపు కాదు, ఇదొక సుశిక్షితమైన సైన్యం.

**సేవా భారతి – కేంద్ర బిందువు:**

సంఘ్ యొక్క సేవా విభాగమైన 'సేవా భారతి' ఆధ్వర్యంలో, ఈ మొత్తం ఆపరేషన్ నడిచింది. దీనికి అనుబంధంగా విశ్వ హిందూ పరిషత్ (VHP), బజరంగ్ దళ్, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం, కిసాన్ సంఘ్ వంటి అన్ని సంఘ పరివార్ సంస్థలు ఏకమయ్యాయి.

- **35,000 మంది స్వయంసేవకులు:** దేశం నలుమూలల నుంచి (ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ మొదలైన రాష్ట్రాల నుంచి) సుమారు 35,000 మంది స్వయంసేవకులు గుజరాత్‌కు తరలివచ్చారు. వీరిలో డాక్టర్లు, ఇంజనీర్లు, విద్యార్థులు, సాధారణ కూలీలు ఉన్నారు.
- **25 విభాగాల వ్యవస్థ:** సేవను సమర్థవంతంగా అందించడానికి, మొత్తం ఆపరేషన్‌ను 25 విభాగాలుగా విభజించారు. ఉదాహరణకు: ఆహార విభాగం, వైద్య విభాగం, వస్తు సేకరణ విభాగం, రవాణా విభాగం, సమాచార విభాగం, మృతదేహాల దహన సంస్కార విభాగం, సర్వే విభాగం.

**సరఫరా గొలుసు (Supply Chain) నిర్వహణ:**

దేశం నలుమూలల నుంచి టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు (గోధుమలు, బియ్యం, పప్పులు), బట్టలు, టెంట్లు, మందులు గుజరాత్‌కు వస్తున్నాయి. వీటిని నిల్వ చేయడం, అవసరమైన వారికి చేర్చడం ఒక పెద్ద సవాలు.

- **సంఘ్ అహ్మదాబాద్,** రాజ్‌కోట్ వంటి నగరాల్లో భారీ గిడ్డంగులను (Warehouses) ఏర్పాటు చేసింది.
- **వచ్చిన వస్తువులను** వర్గీకరించి (Sorting), కిట్లుగా (Kits) తయారుచేసి, ట్రక్కుల ద్వారా ప్రభావిత గ్రామాలకు పంపారు.
- **పారదర్శకత:** ప్రతి రూపాయికి, ప్రతి కిలో బియ్యానికి లెక్క రాశారు. ఈ పారదర్శకత చూసే, దేశ విదేశాల నుంచి దాతలు నేరుగా సంఘ్ కార్యాలయాలకు వచ్చి విరాళాలు ఇచ్చారు.

**వైద్య సేవ – నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (NMO):**

సంఘ ప్రేరణతో నడిచే వైద్యుల సంస్థ NMO, అద్భుతమైన సేవ చేసింది.

- **వందలాది మంది** స్పెషలిస్ట్ డాక్టర్లు తమ క్లినిక్‌లను మూసివేసి, గుజరాత్‌కు వచ్చారు.
- **మొబైల్ ఆపరేషన్** థియేటర్లను ఏర్పాటు చేసి, శిథిలాల మధ్యే క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేశారు.
- **ఎముకలు విరిగిన వారికి,** తలకు దెబ్బలు తగిలిన వారికి అత్యాధునిక వైద్యం అందించారు.

**కమ్యూనికేషన్ నెట్‌వర్క్:**

టెలిఫోన్ లైన్లు దెబ్బతిన్నప్పుడు, సంఘ్ తన సొంత వైర్‌లెస్ నెట్‌వర్క్‌ను (Ham Radio వంటివి) ఉపయోగించి, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంది. ఏ గ్రామంలో ఆహారం లేదు? ఎక్కడ డాక్టర్లు కావాలి? అనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తూ, సేవలో జాప్యం లేకుండా చూసింది.

ఈ వ్యవస్థీకృత పనితీరు, విపత్తు నిర్వహణలో 'సిక్స్ సిగ్మా' (Six Sigma) స్థాయి ఖచ్చితత్వాన్ని తలపించింది.

**సర్వ ధర్మ సమభావ – వివక్ష లేని మానవత్వం**

సంఘంపై విమర్శకులు తరచుగా 'మతతత్వ' ముద్ర వేస్తుంటారు. కానీ, గుజరాత్ భూకంపం, ఆ విమర్శలకు ఒక చెంపపెట్టు. విపత్తుల సమయంలో సంఘ సేవకు కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు. ఉన్నదల్లా మానవత్వం మాత్రమే.

**ముస్లిం గ్రామాల్లో సేవ:**

కచ్ ప్రాంతంలో అనేక ముస్లిం గ్రామాలు ఉన్నాయి. భూకంపం వారినీ వదల్లేదు. సంఘ స్వయంసేవకులు, హిందూ గ్రామాలకు ఎంత వేగంగా వెళ్లారో, ముస్లిం గ్రామాలకు కూడా అంతే వేగంగా, అంతే ఆత్మీయతతో వెళ్లారు.

- **వారికి ఆహారం** అందించారు, వారి గాయాలకు చికిత్స చేశారు, వారి మృతదేహాలను గౌరవప్రదంగా, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం ఖననం చేయడానికి సహాయపడ్డారు.
- **కసాయివాడలో సేవ:** భుజ్‌లోని కసాయివాడ (ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతం) పూర్తిగా ధ్వంసమైంది. అక్కడకు వెళ్ళడానికి ఎవరూ సాహసించని సమయంలో, సంఘ కార్యకర్తలు అక్కడకు వెళ్ళి, శిథిలాలను తొలగించి, బాధితులను రక్షించారు.
- **ముస్లింల ప్రశంసలు:** ఈ నిస్వార్థ సేవ చూసి, అనేకమంది ముస్లిం సోదరులు కన్నీళ్లతో సంఘ కార్యకర్తలను ఆలింగనం చేసుకున్నారు. "అల్లా మమ్మల్ని రక్షించడానికి మిమ్మల్ని పంపాడు" అని ప్రశంసించారు. ఇది సంఘ్ యొక్క నిజమైన 'సెక్యులర్' (సర్వ ధర్మ సమభావ) స్ఫూర్తికి నిదర్శనం.

**శవ సంస్కారాలు – కఠిన పరీక్ష:**

వేలాది అనాథ శవాలు కుళ్ళిపోతున్నాయి. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆ శవాలను తాకడానికి బంధువులు కూడా లేరు. అప్పుడు స్వయంసేవకులు, ముఖానికి గుడ్డలు కట్టుకుని, ఆ శవాలను ట్రాక్టర్లలో తరలించి, సామూహిక దహన సంస్కారాలు నిర్వహించారు. కులం, మతం చూడకుండా, ప్రతి మనిషికీ గౌరవప్రదమైన వీడ్కోలు పలికారు. ఇది మానవత్వానికి పరాకాష్ట.

**పునర్నిర్మాణం – పునరావాసం నుంచి పునరుజ్జీవనం వరకు**

తక్షణ సహాయం (Relief) ఒక ఎత్తు అయితే, సర్వస్వం కోల్పోయిన వారి జీవితాలను తిరిగి నిలబెట్టడం (Rehabilitation) మరో ఎత్తు. సంఘ్ తన పనిని కేవలం ఆహారం పంపిణీతో ఆపలేదు. అది ఒక దీర్ఘకాలిక పునరావాస ప్రణాళికను అమలు చేసింది.

**గ్రామాల దత్తత – 'ఛాప్రేడి' నమూనా:**

సేవా భారతి, VHP లు కలిసి, పూర్తిగా ధ్వంసమైన అనేక గ్రామాలను దత్తత తీసుకున్నాయి. వాటిని కేవలం పునర్నిర్మించడమే కాదు, మునుపటి కంటే మెరుగైన, ఆధునికమైన, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాయి.

- **ఛాప్రేడి (Chhapredi):** భుజ్ తాలూకాలోని ఈ గ్రామం పూర్తిగా నేలమట్టమైంది. సేవా భారతి ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని, అక్కడ భూకంప నిరోధక (Earthquake Resistant) సాంకేతికతతో పక్కా ఇళ్లను నిర్మించింది. పాఠశాల, కమ్యూనిటీ హాల్, దేవాలయం, నీటి సౌకర్యం కల్పించింది. ఈ రోజు ఛాప్రేడి, ఒక 'స్మార్ట్ విలేజ్'గా మారింది.
- **86 గ్రామాల పునర్నిర్మాణం:** సంఘ పరివార్ సంస్థలు మొత్తం 86 గ్రామాలను పునర్నిర్మించాయి. వేలాది ఇళ్లను కట్టించి బాధితులకు ఉచితంగా అందజేశాయి.

**విద్యా భారతి – పాఠశాలల పునరుద్ధరణ:**

భూకంపం వల్ల వందలాది పాఠశాలలు కూలిపోయాయి. పిల్లల చదువు ఆగిపోకూడదని, సంఘ్ విద్యా విభాగమైన విద్యా భారతి తక్షణమే రంగంలోకి దిగింది.

- **టెంట్ల కింద** తాత్కాలిక పాఠశాలలు ప్రారంభించింది.
- **కూలిపోయిన** పాఠశాలలను పునర్నిర్మించింది.
- **అనాథలైన** పిల్లల చదువు బాధ్యతను స్వీకరించింది.

**జీవనోపాధి కల్పన:**

కేవలం ఇళ్లు ఇస్తే సరిపోదు, బ్రతకడానికి ఉపాధి కావాలి.

- **గో సేవ:** పశువులను కోల్పోయిన రైతులకు, కిసాన్ సంఘ్ ద్వారా కొత్త పశువులను, పశుగ్రాసాన్ని అందించారు.
- **వృత్తి పరికరాలు:** చేతివృత్తుల వారికి, కుమ్మరులకు, వడ్రంగులకు పనిముట్లు (Tool Kits) పంపిణీ చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు ఇచ్చారు.

ఈ పునరావాస కార్యక్రమాలు, బాధితులను యాచకులుగా కాకుండా, తిరిగి స్వాభిమానంతో బ్రతికే పౌరులుగా మార్చాయి.

**నాయకత్వం మరియు స్ఫూర్తి** – 'మోదీ' అనే సంఘటనా కర్త

ఈ బృహత్తర ఆపరేషన్‌లో, ఆనాటి సంఘ్, బీజేపీ నాయకుల పాత్ర విస్మరించలేనిది. ముఖ్యంగా, అప్పటికి ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రి కాకముందే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న శ్రీ నరేంద్ర మోదీ, ఈ సేవా కార్యక్రమాలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

- **ఆయన** సంఘటనా అనుభవం, క్షేత్రస్థాయి పరిజ్ఞానం, సేవా భారతి కార్యకలాపాలను వేగవంతం చేయడానికి ఉపయోగపడ్డాయి.
- **ఈ భూకంపం** తర్వాత జరిగిన పునర్నిర్మాణమే, తర్వాతి కాలంలో ఆయన ముఖ్యమంత్రిగా గుజరాత్‌ను ఒక 'మోడల్ స్టేట్'గా మార్చడానికి పునాది వేసింది. విపత్తును అవకాశంగా (Opportunity in Adversity) మలచుకునే నాయకత్వ లక్షణం ఇక్కడే ప్రస్ఫుటమైంది.

**అటల్ జీ భరోసా:**

అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి గారు, స్వయంగా భుజ్‌ను సందర్శించి, బాధితులకు భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అపారమైన నిధులను విడుదల చేశారు. సంఘ్ వంటి సంస్థలు చేస్తున్న పనిని చూసి, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేసింది.

**మానవతా సౌధానికి పునాది రాళ్లు**

2001 గుజరాత్ భూకంపం, ఒక పెను విషాదం. కానీ, ఆ విషాదంలో నుంచే, మానవత్వం అనే ఒక అద్భుతమైన పుష్పం వికసించింది. ఆ వికాసానికి మూలకారణం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్.


**సంఘం చేసిన ఈ అతిపెద్ద సేవా ఆపరేషన్, అనేక సత్యాలను నిరూపించింది:**

1. **సంఘం అంటే కేవలం హిందుత్వ కాదు, అది మానవత్వం:** కష్టకాలంలో సంఘం ఎవరి మతాన్ని చూడదు, మనిషిని మాత్రమే చూస్తుంది.
2. **క్రమశిక్షణే బలం:** సైన్యం లేని చోట, ప్రభుత్వం స్తంభించిన చోట, సంఘ స్వయంసేవకులే 'సివిలియన్ సోల్జర్స్'గా (పౌర సైనికులు) మారి దేశాన్ని కాపాడగలరు.
3. **నిస్వార్థ సేవ:** వారు ఏ ప్రచారం కోరుకోలేదు. టీవీ కెమెరాల కోసం పోజులు ఇవ్వలేదు. నిశ్శబ్దంగా పనిచేశారు, నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఈ పునరావాస కార్యక్రమాలను సందర్శించినప్పుడు, సంఘ్ పనితీరును చూసి ఆశ్చర్యపోయారు. అంతర్జాతీయ మీడియా, సంఘ్ సామర్థ్యాన్ని ప్రశంసించింది. కానీ, స్వయంసేవకులకు ఆ ప్రశంసల కంటే, కొత్త ఇంట్లోకి అడుగుపెడుతున్న ఒక వృద్ధురాలి కళ్ళలోని ఆనంద బాష్పాలు, స్కూలుకు వెళుతున్న పిల్లల నవ్వులే నిజమైన పతకాలు.

గుజరాత్ భూకంప సహాయక చర్యలు, సేవా రంగంలో ఒక సువర్ణాధ్యాయం. ఇది డాక్టర్ హెడ్గేవార్ కలలుగన్న 'శక్తివంతమైన, సేవా తత్పరత కలిగిన సమాజం' ఆచరణలో ఎలా ఉంటుందో ప్రపంచానికి చూపించింది. ఈ రోజు గుజరాత్ అద్భుతమైన ప్రగతి పథంలో ఉందంటే, ఆనాడు ఆ కష్టకాలంలో సంఘ స్వయంసేవకులు వేసిన పునాది రాళ్లు, చిందించిన స్వేదం, చూపిన ప్రేమ కూడా అందులో ఒక భాగమే. ఆ సేవా స్ఫూర్తి, రాబోయే తరాలకు ఎప్పటికీ ఒక మార్గదర్శిగా నిలిచి ఉంటుంది.

**రచన: భూక్యా గోపినాయక్**




## ఈ బిహార్ యువ మంత్రి
# అర్జున్ అవార్డ్ గ్రహీత

**పాట్నా (ఏడీఎన్ఎన్) :**

బిహార్ లో కొత్తగా కొలువుతీరిన నీతీశ్ కుమార్ ప్రభుత్వంలో ముగ్గురు మహిళలు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బిహార్ రాష్ట్ర రాజకీయాలలో పురుషాధిక్యత అధికంగా ఉందనేది బహిరంగ రహస్యమే. అయితే ఈసారి ఎన్నికలలో మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్ లో పాల్గొన్నారు. దీనితో రమా నిషాద్, శ్రీయశీ సింగ్, లేశీ సింగ్ లను మహిళా మంత్రులుగా నియమించారు. వీరిముగ్గురులోకి చిన్నదైన శ్రేయసీ సింగ్ మనందరికీ సుపరిచితమే. ఆమె షూటింగ్ లో అర్జున అవార్డ్ గ్రహీత. అంతేకాదు 2014లో కామన్వెల్త్ గేమ్స్ లో రజత పతకాన్ని, 2018లో స్వర్ణపతకాన్ని గెలుచుకున్నారు. అలాగే 61 వ జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్ లో బంగారు పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్ లో మహిళల ట్రాప్ ఈవెంట్ లో కూడా పోటీపడ్డారు. దివంగత నేత, మాజీ మంత్రి దిగ్విజయ్ సింగ్ కుమార్తె అయిన శ్రేయసీ ఇప్పుడు రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవినలంకరించింది. తన తండ్రి దిగ్విజయ్ సింగ్, తాత సెరేందర్ సింగ్ ఇద్దరూ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షులుగా పని చేయడంతో ఆమెకు చిన్ననాటి నుండి షూటింగ్ పట్ల ఇష్టం ఏర్పడింది. తండ్రి ఆకస్మిక మరణంతో శ్రేయసీ రాజకీయాలలో అడుగుపెట్టింది. క్రీడలూ, రాజకీయాలతో పాటు చదువులో కూడా ఎంబీయే చేసి, కొవిడ్ సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాలలో విద్య, క్రీడల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారామె. రాజకీయాల పట్ల దురభిప్రాయం ఉండకూడదని, మంచివాళ్లు ఈ రంగాన్ని వదిలేస్తే చెడ్డవాళ్లు ఆధిపత్యం చెలాయిస్తారని తన తండ్రి చెప్పేవారని ఆమె చెప్తూంటారు. మంత్రిగా తన బాధ్యతలు నెరవేర్చడంతో పాటు 2028 ఒలింపిక్స్ కోసం కూడా సిద్ధమవుతున్నానని పేర్కొన్నారు శ్రేయసీ సింగ్.

## రష్యన్ క్రూడ్ ఆయిల్ దిగుమతిపై
# రిలయన్స్ కీలక నిర్ణయం



**గుజరాత్ (ఏడీఎన్ఎన్) :**

రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని తన సెజ్ శుద్ధి కర్మాగారంలో రష్యన్ చమురు వినియోగాన్ని నిలిపివేసినట్లు ప్రకటించింది. జామ్‌నగర్‌లోని రిలయన్స్ చమురు శుద్ధి సముదాయంలో రెండు శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. ఒకటి దేశీయ మార్కెట్‌కు అవసరాలను తీరుస్తుండగా, మరొకటి ప్రత్యేక ఆర్థిక జోన్ యూనిట్, దీని నుండి ఇది యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్ వంటి ఇతర మార్కెట్లకు ఇంధనాలను ఎగుమతి చేస్తుంది. రిలయన్స్ ఇండియాలో అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారు. క్రూడ్ ఆయిల్‌ను ప్రాసెస్ చేసి పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనంగా మారుస్తుంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అమెరికా విధించిన ఆంక్షలకు అనుగుణంగా ఎగుమతి ఉత్పత్తుల కోసం ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ మార్కెట్‌కు సరఫరాపై ఎటువంటి ప్రభావం ఉండదని ప్రకటించింది. గుజరాత్‌లోని జామ్‌నగర్ లో ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్‌సైట్ ఆయిల్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్, భారతదేశానికి రవాణా చేయబడిన రోజుకు 1.8 మిలియన్ బ్యారెళ్ల రష్యన్ ముడి చమురులో సగం కొనుగోలు చేస్తోంది. ఈ కంపెనీ ముడి చమురును పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనంగా శుద్ధి చేస్తుంది. ఇప్పుడు రిలయెన్స్ ఈ చమురు వినియోగాన్ని నిలిపివేయడంతో దాదాపు రష్యన్ దిగుమతులకు అడ్డుకట్ట వేసినట్లే.



## కార్మికులకు
# కేంద్రం గుడ్ న్యూస్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

కార్మికుల సంక్షేమానికి సంబంధించి కేంద్రం ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారి కోసం నవంబర్ 21 నుంచి కొత్త లేబర్ కోడ్ రూల్స్ అమల్లోకి వస్తాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. ఈ రూల్స్ ప్రకారం సకాలంలో కనీస వేతనాలు చెల్లించడంతో పాటు అపాయింట్‌మెంట్స్ లెటర్స్ ఇవ్వాలని సూచించింది.

- **పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన వేతనంతో పాటు గౌరవం కల్పించాలని తెలిపింది.**
- **ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఒక సంవత్సరం తర్వాత గ్రాట్యూటీ సౌకర్యం కల్పించనున్నట్లు హామీ ఇచ్చింది.**
- **40 ఏళ్లు పైబడిన కార్మికులకు సంవత్సరానికి ఒకసారి ఉచితంగా హెల్త్ చెకప్**
- **ఓవర్ టైమ్ పనిచేసినవారికి డబుల్ వేతనం**
- **ప్రమాదకర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 100 శాతం ఆరోగ్య భద్రత.**
- **అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం కల్పిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.**

నేటి నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త లేబర్ కోడ్స్ దేశంలోని 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని మాండవీయ స్పష్టం చేశారు.



## బాయిలర్ పేలి 15 మంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. పంజాబ్ ప్రావిన్స్ ఫైసలాబాద్‌లో ఓ గ్లూ(గమ్) తయారుచేసే ఫ్యాక్టరీలో బాయిలర్ పేలడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకూ 15 మంది వరకు చనిపోయారు. ఈ ఘటనలో మరికొంతమందికి తీవ్ర గాయాలపాలయ్యారు.

పేలుడుకు గల కారణాలు తెలియాల్సిఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన తర్వాత ఫ్యాక్టరీ యజమాని పరారీలో ఉండగా, మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాయిలర్ పేలుడు దాటికి ఫ్యాక్టరీ భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న నివాసాలకు కూడా నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పాకిస్తాన్ లోని పంజాబ్ సీఎం మరయం నవాజ్ షరీఫ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాకిస్తాన్ లోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడంతోనే తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానిక మీడియా పేర్కొంది. గతేడాది కూడా ఫైసలాబాద్‌లో బాయిలర్ పేలి 12 మంది మరణించిన సంగతిని పేర్కొంది. వారం క్రితం కరాచీలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలోనూ పేలుడు సంభవించి నలుగురు మృతి . కొంతమందికి గాయాలు అయ్యాయి .



## భారత్, పాక్‌లకు ట్రంప్ ఝలక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఒక సౌదీ పెట్టుబడుల వేదిక సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ సమక్షంలో మాట్లాడుతూ, భారత్ ,పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవిస్తే రెండు దేశాలపై 350% సుంకాలు విధిస్తానని హెచ్చరించానని పేర్కొన్నారు. "ఇకపై అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు ఉండవని స్పష్టంగా చెప్పాను. దీని ద్వారా రెండు దేశాలు వెనక్కి తగ్గాయి." అని ట్రంప్ తెలిపారు. వివాదాలను పరిష్కరించడంలో నేను నిపుణుడని, పలు దేశాల మధ్య సమస్యలను పరిష్కరించినట్లు చెప్పాడు. "యుద్ధాలు జరగకుండా అడ్డుకున్నాను. భారత్, పాకిస్తాన్ అణ్వాయుధాలతో యుద్ధానికి సిద్ధమయ్యారు. భారత్ , పాక్ లకు మీరు యుద్ధం చేసుకోవచ్చుఅని , అప్పుడు నేను వారిని హెచ్చరించానని ఆయన తెలిపారు. కానీ ఇకపై అమెరికాతో వ్యాపారం చేయలేరని స్పష్టంగా చెప్పినట్లు " ట్రంప్ చెప్పారు. అణుయుద్ధం సంభవిస్తే లక్షలాది ప్రాణాలు నష్టపోతాయని, అణు ధూళి లాస్ ఏంజెలెస్‌లోకి వెళ్లి మానవ జీవితాలను ప్రభావితం చేస్తుందని చర్చించారు. సమస్యను పరిష్కరించడానికి నా దగ్గరకు వచ్చినప్పుడు అమెరికా సాయం చేస్తుందని తెలిపాను. ట్రంప్ యుద్ధ పరిస్థితుల నుంచి బలవంతపు ఆర్థిక, రాజకీయ ఒత్తిడులను ఉపయోగించి రెండు దేశాలను వెనక్కి తగ్గించామని హైలైట్ చేశారు. ఈ సందర్భంలో ఆయన దృష్టిలో ప్రధానంగా అణు యుద్ధం నివారణ, వాణిజ్య సంబంధాల భద్రత, అంతర్జాతీయ పరిష్కార వ్యూహాల ప్రాముఖ్యం నెలకొంది.



## ఇరాన్ చమురుపై అమెరికా ఒత్తిడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా ప్రభుత్వం ఇరాన్ నుంచి చమురు రవాణాపై ఆర్థిక ఒత్తిడిని సృష్టించేందుకు కొత్త ఆంక్షలు విధించింది. ఈ చర్యల్లో 17 సంస్థలు, వ్యక్తులపై ముఖ్యంగా ఫోకస్ పెట్టింది. ఈ ఆంక్షలు ప్రధానంగా టెహ్రాన్ సైనిక కార్యకలాపాలకు నిధులు అందకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అమెరికా ట్రెజరీ శాఖ తెలిపింది. ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధి, ఉగ్రవాద ప్రాక్సీలకు మద్దతు అందించకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ఇజ్రాయెల్‌తో 12 రోజుల యుద్ధంలో ఓటమి తర్వాత టెహ్రాన్ సైనిక దళాలకు నిధులు సమకూర్చడంలో చమురు ఆదాయం కీలకమని ట్రెజరీ తెలిపింది. భారత్‌కు చెందిన కొన్ని కంపెనీలు, వ్యక్తులు కూడా ఈ ఆంక్షల్లో చేరారు. ప్రత్యేకంగా టీఆర్6 పెట్రో కంపెనీ 202425లో బహుళ కంపెనీల నుంచి 8 మిలియన్ డాలర్ల చమురును దిగుమతి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎన్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థ, మరికొందరు భారతీయుల పేర్లను కూడా జాబితాలో చేర్చారు. ఇరాన్‌కు చెందిన ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ పై కూడా అమెరికా చర్యలు తీసుకుంది. మహాన్ ఎయిర్ యాజ్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌వేస్ ఆంక్షలకు గురయ్యాయి. ఇవి ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తో కలిసి పనిచేస్తున్నారన్న ఆరోపణలపై ఆంక్షలు విధించింది. సిరియా, లెబనాన్‌లో ఇరానియన్ ప్రాక్సీలకు ఆయుధాలు,సిబ్బంది రవాణా చేయడంలో సహకరిస్తారని అమెరికా పేర్కొంది. ఈ చర్యలు ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచే ప్రయత్నంగా, చమురు ద్వారా వచ్చే ఆదాయాన్ని అడ్డుకోవడం, అంతర్జాతీయ భద్రత కోసం కీలకమైనవి. ఈ పరిణామాలు, భారతీయ కంపెనీలకు కూడా ప్రభావం చూపుతాయి.

# హసీనాతో భారత్ భంగపడేనా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందడం ఇప్పుడు దక్షిణాసియా రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.



విద్యార్థుల నిరసనలతో ఆమె ప్రభుత్వం కూలిపోయిన తర్వాత దేశాన్ని విడిచి భారత సరిహద్దులోకి ప్రవేశించిన హసీనాపై బంగ్లాదేశ్ ప్రత్యేక న్యాయస్థానం తాజాగా మానవహక్కుల ఉల్లంఘనల కేసులో మరణదండన విధించింది. ఈ పరిణామాలు భారత్‌కు ఒకవైపు మానవతా బాధ్యతగా కనిపించినా, మరోవైపు ప్రాంతీయ దౌత్యానికి అతి పెద్ద పరీక్షగా నిలుస్తున్నాయి.

**భారత్–బంగ్లాదేశ్ సంబంధాలపై ప్రభావం**

హసీనా గత 15 ఏళ్ల పాలనలో భారత్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. ప్రాంతీయ స్థిరత్వం, ఉగ్రవాద నిరోధం, రవాణా అనుసంధానం, ఈశాన్య రాష్ట్రాల భద్రత వంటి అంశాల్లో బంగ్లాదేశ్ భారత్‌కు కీలక భాగస్వామిగా మారింది. ఈ నేపథ్యంలో హసీనా భారత్‌లో ఆశ్రయం పొందడం కొత్త దౌత్య సవాళ్లకు దారి తీసింది. ఢాకా ప్రభుత్వం హసీనా అప్పగింత కోరుతున్నప్పటికీ, ఆమెకు మరణదండన ప్రమాదం ఉన్నందున ఢిల్లీ ఆ అభ్యర్థనపై ఆసక్తి చూపడం లేదు. అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనల ప్రకారం, మరణశిక్ష ఎదుర్కొనే వ్యక్తిని ఒప్పందం ఉన్నప్పటికీ అప్పగించడం కఠినతరమే. ఈ అంశం భారత్‌ను దౌత్య పరంగా మరింత సంక్లిష్ట పరిస్థితిలోకి నెడుతోంది.

**తాత్కాలిక ప్రభుత్వ మారుతున్న విదేశాంగ దృక్పథం**

హసీనా పదవి కోల్పోయిన వెంటనే నోబెల్ బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నియమితులయ్యారు. వారి నాయకత్వంలో కొత్త విదేశాంగ విధానం రూపుదిద్దుకుంటోందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా "డిఇండియనైజేషన్" వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతోందని సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రచురించిన ఓ అధ్యయనం పేర్కొంది. ఢాకా ఇప్పటికే భారత్‌తో ఉన్న పలు చట్టపరమైన ఒప్పందాలను నిలిపివేసింది. ఇంధన ఒప్పందాలు పునర్విమర్శనకు వెళ్లాయి. రవాణా అనుసంధాన ప్రాజెక్టులు నెమ్మదించాయి. చైనా, పాకిస్తాన్, టర్కీ లాంటి దేశాలతో సంబంధాలు బలోపేతం చేసేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఇది భారత్‌కు హెచ్చరికసూచక మార్పుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. బంగ్లాదేశ్ దక్షిణాసియాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఏడాది ద్వైపాక్షిక వాణిజ్యం రూ.1.15 లక్షల కోట్లను దాటింది. బంగ్లాదేశ్ ముడిపదార్థాలు, ఇంధనం, విద్యుత్, రవాణా మార్గాల కోసం పెద్ద మొత్తంలో భారత్‌పైనే ఆధారపడుతోంది. మరోవైపు భారత్ కూడా ఈశాన్య రాష్ట్రాలకు అనుసంధానం కోసం బంగ్లాదేశ్ భూభాగాన్ని కీలకంగా ఉపయోగిస్తోంది. ఈ అనుబంధం అంత సులభంగా తెగిపోకపోయినా, రాజకీయ ఉద్రిక్తతలు ఈ బంధాన్ని బలహీనపరచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఢాకాలోని సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్స్ సర్వేలో 75% బంగ్లాదేశీయులు చైనాతో సంబంధాలను సానుకూలంగా చూస్తున్నట్లు తేలడం, భారత్‌పై ప్రజల అభిప్రాయం దిగజారుతోందని వ్యక్తమవుతోంది. కేవలం 11% మాత్రమే భారత్‌ను సానుకూలంగా భావించడం, భారత్ మద్దతు ఉన్న హసీనా పాలన ప్రతికూలంగా ప్రజల్లో భావన పెంపొందించిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**భారత్ ముందున్న ఎంపికలు**

దక్షిణాసియా నిపుణుడు మైఖేల్ కుగెల్‌మాన్ ప్రకారం, భారత్‌కు ఇప్పుడు నాలుగు ఎంపికలు మాత్రమే ఉన్నాయి . హసీనాను అప్పగించడం, భారత్‌లో ఉంచడం, ఆమెను రాజకీయంగా నిశ్శబ్దం చేయాలని కోరడం, లేదా మూడో దేశానికి పంపించడం. ఇవేవీ సులభం కాదు. ప్రతి మార్గం భారీ దౌత్య ప్రభావం కలిగిస్తుంది.

**సరిహద్దులో భద్రతా ఆందోళనలు**

రెండు దేశాలు 4,096 కి.మీ. సరిహద్దు పంచుకుంటున్నాయి. బంగ్లాదేశ్‌లో అస్థిరత పెరగడం శరణార్థుల ప్రవాహం, ఉగ్రవాద కార్యకలాపాల పునరుజ్జీవనం, డ్రగ్ ట్రాఫికింగ్ వంటివి పెరిగే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో భారత్ తన చర్యల్లో మరింత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. 2025లో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిగే వరకు భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు అస్థిరంగా ఉండే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాత్కాలిక ప్రభుత్వం నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహిస్తే, కొత్త ప్రభుత్వం సంబంధాలను పునరుద్ధరించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే, ఈ సంక్షోభం భారత్‌కు ఒక ప్రధాన పరీక్ష- మానవ హక్కులు, దౌత్య ప్రయోజనాలు, వ్యూహాత్మక సంబంధాలు అన్నిటినీ సమన్వయం చేసుకుంటూ ఎలా ముందుకు సాగాలి అనేది ఢిల్లీకి ముఖ్య సవాల్‌గా మారింది.

# గాజాలో భారీ టన్నెల్‌ను గుర్తించిన ఇజ్రాయెల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా గాజాలో ఇజ్రాయెల్ భీకర దాడులకు తెగబడుతోంది. హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై ఐడీఎఫ్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. కాల్పుల విరమణను ఉల్లంఘించి గాజాతోపాటూ లెబనాన్‌పైనా బాంబులతో విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో ఇజ్రాయెల్ దళాలు గాజాలో హమాస్‌కు చెందిన భారీ టన్నెల్‌ను గుర్తించాయి. సుమారు 7 కిలోమీటర్ల పొడవు, 25 మీటర్ల లోతుతో ఈ టన్నెల్‌ను నిర్మించినట్లు ఐడీఎఫ్ గుర్తించింది. దాదాపు 80 రూమ్‌లతో కూడిన ఈ టన్నెల్ వీడియోని ఇజ్రాయెల్ తాజాగా బయటపెట్టింది.. ఇందులో మొహమ్మద్ సిన్వర్, మొహమ్మద్ షబానా సహా హమాస్ కీలక నేతలు తలదాచుకునేవారని ఇజ్రాయెల్ దళాలు నిర్ధరించాయి. అంతేకాదు గతంలో అపహరించబడిన ఐడీఎఫ్ అధికారి లెఫ్టినెంట్ హదర్ గోల్డిన్‌ను కూడా



ఇక్కడే బంధించినట్లు ఇజ్రాయెల్ గుర్తించింది. అక్కడ గోల్డిన్‌కు సంబంధించిన వస్తువులను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ సొరంగం జనసాంద్రత కలిగిన రఫా ప్రాంతంలో గుర్తించారు. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ (యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్) కంపౌండ్, మసీదులు, క్లినిక్స్, స్కూళ్లు లాంటి సున్నితమైన ప్రాంతాల గుండా ఈ టన్నెల్ వెళుతుందని ఐడీఎఫ్ తెలిపింది. ఏకంగా ఓ నగరాన్నే నిర్మించుకున్నారని.. లోపల అత్యంతక్లిష్టమైన పరిస్థితులు ఉన్నట్లు ఇజ్రాయెల్ బలగాలు వెల్లడించాయి. టైల్స్‌తో ఈ టన్నెల్ నిర్మాణం చేపట్టినట్లుగా వీడియో ద్వారా తెలుస్తోంది. అంతేకాదు ఇందులో 80 గదులతో ప్రత్యేక సదుపాయాలను నిర్మించుకుంది హమాస్. వెస్ట్రన్ టాయ్‌లెట్స్‌తో కూడిన బాత్రూమ్‌లు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు, దీర్ఘకాలిక నివాసాలతో పాటూ భారీగా ఆయుధ నిల్వలను ఐడీఎఫ్ ఈ టన్నెల్‌లో గుర్తించింది. ఇందుకు సంబంధించిన వీడియోని కూడా ఐడీఎఫ్ దళాలు సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు.

# గోల్డెన్ కమోడ్.. ఏకంగా రూ.107 కోట్లు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఏకంగా రూ.107 కోట్లు పలికిన గోల్డెన్ టాయిలెట్ కమోడ్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. వేలం పాటల్లో అనేక అరుదైన వస్తువులు, చారిత్రక కళాఖండాలు భారీ ధరలకు అమ్ముడవుతుంటాయి.

అయితే అమెరికాలోని న్యూయార్క్ లో సోథెబీస్ నిర్వహించిన తాజా వేలంలో బంగారంతో తయారు చేసిన ఒక టాయిలెట్ కమోడ్ ఏకంగా రూ.107 కోట్లు పలకడం ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.

పూర్తిగా పనిచేసే 18 క్యారెట్ల బంగారు కమోడ్‌ను ఇటాలియన్ ఆర్టిస్ట్ మౌరీజియో కాటెలాన్ రూపొందించారు. "అమెరికా" అని పేరు పెట్టిన ఈ కళాఖండం అత్యంత ధనవంతుల జీవనశైలిపై వ్యంగ్యంగా చేసిన సెటైర్‌గా కళా ప్రపంచంలో ప్రత్యేక చర్చకు దారి తీసింది. గోల్డెన్ కమోడ్ బరువు 101 కిలోలు. ప్రారంభ బిడ్ 10 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.88 కోట్లు) కాగా, చివరికి 12.1 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.107 కోట్లు) అమ్ముడైంది. గోడకు అరటిపండును టేప్‌తో అతికించి గతంలో సంచలన సృష్టించిన కాటెలాన్, ఈసారి తన వ్యంగ్యాన్ని ఘన బంగారంలో మలచి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. "200 డాలర్ల లంచ్ తిన్నా, 2 డాలర్ల హాట్‌డాగ్ తిన్నా... టాయిలెట్ మాత్రం ఒకటే" అని కాటెలాన్ పాత వ్యాఖ్య ఈ కమోడ్ వెనుక ఉన్న సామాజిక సందేశాన్ని మరింత స్పష్టంగా చేస్తుంది. అదే వేలంలో మరో కళాఖండం కూడా రికార్డు స్థాయి ధరను నమోదు చేసింది. ఆస్ట్రియన్ చిత్రకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన 'పోర్ట్రెయిట్ ఆఫ్ ఎలిజబెత్ లెడెరర్' చిత్రపటం 236 మిలియన్ డాలర్లు (రూ.1,960 కోట్లు) పలికి ఆధునిక కళాఖండాల వేలంలో ప్రపంచ రికార్డు సృష్టించింది. కాటెలాన్ రూపొందించిన బంగారు కమోడ్‌కు ఇదే మొదటి సంచలనం కాదు. 2016లో తయారు చేసిన ఇలాంటి కమోడ్‌ను యూకే బ్లెన్‌హైమ్ ప్యాలెస్‌లో ప్రదర్శనలో పెట్టగా, దానిని దొంగిలించిన ఘటన అంతర్జాతీయ వార్తలకెక్కింది. దొంగలు దానిని కరిగించి ఉండవచ్చని అధికారులు పేర్కొనడం ఆ సంఘటనను మరింత రహస్యంగా మార్చింది. ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఈ బంగారు టాయిలెట్ కమోడ్, కళ, విలాసం, వ్యంగ్యం -ఆల్ ఇన్ వన్ గా నిలిచి ఈ సంవత్సరం అత్యంత చర్చనీయాంశమైన వేలం కళాఖండాలలో ఒకటిగా నిలిచింది.

# పిండి గిర్నితో బాంబుల తయారీ..

- ఫరీదాబాద్‌లో ఉగ్రవాదుల భారీ సెటప్
- దేశమంతా దాడులకు భారీ ప్లాన్
- దేశవ్యాప్తంగా దాడులకు భారీ వ్యూహం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఢిల్లీ పేలుడు ఘటన దర్యాప్తు వేగంగా కొనసాగుతుండగా, మరోవైపు ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌కు సంబంధించిన అనేక అంశాలు సంచలనంగా మారాయి. ఈ దర్యాప్తులో కీలకంగా డాక్టర్ ముజమ్మిల్ పాత్ర చుట్టూ అనేక సంఘటనలు వెలుగుచూస్తున్నాయి .



ఫరీదాబాద్ ప్రాంతంలోని ధోజ్ గ్రామంలో ఉన్న ఓ ట్యాక్సీ డ్రైవర్ ఇంటిని బాంబుల తయారీకి అనుకూల రహస్య స్థావరంగా మార్చినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. పిండి తయారీకి ఉపయోగించే గిర్నిని కెమికల్ వర్క్ షాప్‌గా మార్చి, కెమికల్ పదార్థాలను పొడిగా చేసేందుకు భారీ గ్రైండర్‌లు, రోలర్లు, మెషినరీ వంటివి వినియోగించినట్లు తెలుస్తోంది. ఈ పరికరాలు బాంబుల తయారీలో కీలకంగా ఉపయోగించబడ్డాయని, పాకిస్తాన్ నుంచి వచ్చిన వందల వీడియోలలోని సాంకేతికతకు అనుగుణంగా చూసి ఈ పద్ధతులు అనుసరించారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే, ఎర్రకోట పేలుడుకు ఒకరోజు ముందు ముజమ్మిల్ 2,600 కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను ఓ మతగురువు ఇంట్లో నిల్వ చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడం సంచలనంగా మారింది. ఈ ఘటనలన్నీ ఫరీదాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఉగ్ర కార్యకలాపాల తీవ్రతను సూచిస్తున్నాయి. ఉగ్ర మాడ్యూల్‌ను మరింత లోతుగా పరిశీలిస్తూ అధికారులు కీలక ఆధారాలు వెలికితీస్తున్నారని తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్‌తో పాటు ఢిల్లీ పేలుడు కేసులో కారు డ్రైవర్‌గా ఉన్న ఉమర్ నబీ కూడా దేశవ్యాప్తంగా దాడుల కోసం రెండేళ్ల పాటు భారీ ఎత్తున ప్రణాళికలు రచించినట్లు దర్యాప్తులో తేలింది. డైరీలు, నోట్‌బుక్‌లలో 'ఆపరేషన్' అనే పదం పునరావృతమవడం, మొత్తం 2530 మంది పేర్లు ఉండటం, అందులో ఎక్కువ మంది జమ్మూకాశ్మీర్, ముజమ్మిల్, ఉమర్ స్వస్థలం లేదా ఫరీదాబాద్ పరిసర ప్రాంతాలకు చెందినవారే ఉండటం ఈ మాడ్యూల్ ప్రభావాన్ని తెలియజేస్తుంది. ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ యూనివర్సిటీ ఉగ్రవాదలకు ఉగ్ర డెన్‌గా మారింది. ఉమర్, షాహీన్, ముజమ్మిల్ వంటి వ్యక్తులు ఇక్కడే కలుసుకున్నారని, హర్యానా డీజీపీతో పాటు ఉన్న అధికారులు యూనివర్సిటీని పరిశీలించి అనేక లోపాలు, అక్రమాలు గుర్తించడంతో ప్రత్యేక సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారని పేర్కొంది.



## అవమానించిన చోటే.. మిస్ యూనివర్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మిస్ యూనివర్స్ 2025 విజేతగా మిస్ మెక్సికో ఫాతిమా బాష్ (25) గెలుపొందింది. థాయ్ లాండ్ లోని నోంతబురి నగరంలో అంగరంగ వైభవంగా ఈ గ్రాండ్ ఫినాలే జరిగింది. స్టీవ్ హార్వే హోస్ట్ గా వ్యవహరించారు.

120 దేశాల పోటీదారులు పాల్గొన్న ఈ పోటీలో ఆమె కిరీటం గెలుచుకున్నారు. మాజీ విశ్వసుందరి విక్టోరియా క్జేర్ థైల్విగ్ (డెన్మార్క్) ఫాతిమాకు కిరీటం పెట్టారు. మెక్సికోలోని టబాస్కో రాష్ట్రం టియాపా ఆమె జన్మస్థలం. ఆమె 19 మే, 2000 సంవత్సరంలో జన్మించారు. ఆమె 5.5 అడుగుల ఎత్తు ఉన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ లో ఉన్నత విద్య పూర్తి చేశారు. ఆమెకు పెయింటింగ్, గుర్రపు స్వారీ, టెన్నిస్ వంటి అభిరుచులున్నాయి. న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నకు జవాబుగా మహిళలు ప్రపంచవ్యాప్తంగా తమ గొంతు వినిపించి.. మార్పు తీసుకురావాలని పేర్కొన్నారు. మొదటి రన్నరప్ గా థాయ్ లాండ్‌కు చెందిన ప్రవీణర్ సింగ్ నిలిచారు. టాప్ 5లో వెనిజులా, ఫిలిప్పీన్స్ కు చెందిన యువతులు నిలిచారు. భారత సుందరి మనికా విశ్వకర్మ టాప్ 12 వరకూ చేరి, స్విమ్ సూట్ రౌండ్ తర్వాత ఎలిమినేట్ అయ్యారు. థాయ్‌లాండ్‌లో జరిగిన 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో ఫాతిమా బాష్ మోడల్ అందాల కిరీటాన్ని గెలుచుకుని వార్తలలో చర్చనీయాంశమయ్యారు. ఈ పోటీ ప్రారంభమైనప్పటినుంచి ఆమె పేరు మీడియాలో చక్కర్లు కొట్టింది. ఫాతిమా ఒక షూట్‌కు హాజరుకాలేదని మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ నేషనల్ డైరెక్టర్ , మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవాత్ ఆమెను నిందించారు. "తెలివితక్కువ వ్యక్తి" అనే భావన వచ్చేలా ఆమెను విమర్శించారు. దీని మీద ఫాతిమా దీటుగా, "మీరు మమ్మల్ని గౌరవించినట్లే మేము మిమ్మల్ని గౌరవిస్తాం. నేను నా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. నా దేశ సంస్థకు మీరు ఏదైనా సమస్య ఉంటే నన్ను లాగకూడదు" అని స్పష్టంగా చెప్పి స్పందించారు. దీనికి నవాత్, "తొలుత నా మాట విని, తర్వాత వాదించండి" అని సమాధానం ఇచ్చారు. ఇలా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, అది ఫేస్బుక్‌లో లైవ్‌స్ట్రీమ్ అయ్యి నెట్టింట్లో వైరల్ అయింది. ఫాతిమా ఆ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించి, మరికొందరు అందాల తారలతో వేదిక నుంచి వాకౌట్ చేశారు. బయటకు వచ్చి మీడియా ముందు ఆమె అసహనాన్ని వ్యక్తం చేశారు. "మన డైరెక్టర్ గౌరవంగా వ్యవహరించలేదు. మనం సాధికారత కలిగిన మహిళలు. ఇది మన గళాన్ని వినిపించే వేదిక" అని ఫాతిమా చెప్పారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా కూడా ఆమె ధైర్యాన్ని కొనియాడుతూ, ఫాతిమా ఒక ఉదాహరణగా నిలిచారని తెలిపారు. ఈ ఘటన తర్వాత నవాత్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ కూడా ప్రతికూల ఘటనను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. 25 ఏళ్ల ఫాతిమా మెక్సికో మోడల్. ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రాడ్యుయేట్. సెప్టెంబర్‌లో మిస్ యూనివర్స్ మెక్సికోను అందించారు. చిన్నప్పుడు డిస్లెక్సియా, హైపర్ యాక్టివిటీ సమస్యలు ఎదుర్కొన్న ఫాతిమా, చదువు నుంచి తోటి పిల్లల హేళనలు ఎదుర్కోవడంతో సేవామార్గం వైపు మళ్లారు. ఫైనల్ రౌండ్‌లో జడ్జిలు అడిగిన ప్రశ్న, "మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు ఏంటి? ఈ కిరీటాన్ని ఉపయోగించి మహిళలకు సురక్షిత వాతావరణాన్ని ఎలా సృష్టిస్తారు?" కు ఫాతిమా సమాధానమిచ్చారు. "భద్రత, సమాన అవకాశాల విషయంలో మహిళలు ఇంకా అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. మన భావాలను వ్యక్తం చేసేందుకు వెనుకాడము కాదు. మార్పు కోరే ధైర్యం మనకు ఉంది. మా గళాన్ని వినిపించడానికి, మార్పు కోసం ఇక్కడ నిలిచాం. కలిసికట్టుగా చరిత్ర సృష్టిద్దాం" అని చెప్పి జడ్జిలను మెప్పించారు. ఈ ఆశ్చర్య, ఆనందంతో నిండిన క్షణాల్లో ఆమె కిరీటాన్ని సొంతం చేసుకున్నారు.

## ఎయిర్ షోలో అపశృతి

మొదటిపేజీ తరువాయి...

2001లో తొలిసారి గాల్లోకి ఎగిరినప్పటి నుంచి 23 ఏళ్ల చరిత్రలో మొదటి ప్రమాదం 2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్ వద్ద ఘటన జరిగింది. ఆ ఘటనలో పైలట్ మృత్యుంజయుడుగా సురక్షితంగా బయటపడ్డారు. తేజస్ 4.5వ తరం, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేయగల మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్. ఇది వైమానిక దాడులు, క్లోజ్ కంబాట్, భూమిపై దాడి వంటి పలు రకాల పాత్రలను సులభంగా నిర్వహించగలదు. ఈ సంఘటనతో దుబాయ్ ఎయిర్ షోలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురిని కంటతడి సైతం పెట్టించాయి.

## కాప్ 30 సదస్సులో ఫైర్

మొదటిపేజీ తరువాయి....

విద్యుత్తు ప్రమాదమే దీనికి కారణమని అనుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంతో చర్చలకు ఆటంకం కలగడంతో అనేక దేశాల ప్రతినిధులు ఒక పెట్రోల్ బంకులో ఆశ్రయం పొందాల్సి వచ్చిందని యూకే ప్రతినిధి బృందంలోని ఒక సభ్యుడు తెలిపారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించే ఈ వాతావరణ చర్చల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ప్రతినిధులతోపాటు వేలమంది ప్రజలు కూడా హాజరవుతున్నారు. వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ఎలా పురోగతి సాధించాలనే అంశంపై ఏకాభిప్రాయం కోసం 200 దేశాలు ఈ సదస్సులో ప్రయత్నిస్తున్నాయి. కాప్ 30 సదస్సులో ఈ ప్రమాదం జరిగిన సమయంలో వాతావరణ చర్చలు, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఒప్పందం, ప్రతినిధులు, ప్రజలు, సహాయక బృందాలు, మంటలు, అగ్ని ప్రమాదం, బెలెమ్ నగరం, బ్రెజిల్, ఐక్యరాజ్య సమితి, పెవిలియన్, మంటలను అదుపులోకి తీసుకువచ్చే చర్యలు, అనారోగ్యానికి గురైన వారు, చికిత్స, సమాచారం, కారణాలు, చర్చలకు ఆటంకం, పెట్రోల్ బంకు ఆశ్రయం, ప్రపంచ వ్యాప్తంగా హాజరైన దేశాలు——ఈ అంశాలన్నీ అదే వాతావరణ చర్చల నేపథ్యంలో కొనసాగాయి.




## ఏపీఎంఐడీసీ జీఎం సూర్యకళ అరెస్ట్

### భారీగా అక్రమ ఆస్తుల బట్టబయలు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

అక్రమ ఆస్తుల కేసులో రాష్ట్ర వైద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (APMSIDC) జనరల్ మేనేజర్ మల్లాది వెంకట సూర్యకళను అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమార్జనపై వచ్చిన స్పష్టమైన సమాచారంతో, శుక్రవారం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో సూర్యకళకు చెందిన మరియు ఆమె బంధువుల నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కూడా సోదాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ఇప్పటివరకు ఇళ్లు, నివాస స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన 27 డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, వివిధ బ్యాంకుల్లో రూ.2 కోట్ల విలువైన ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. సూర్యకళ నివాసంలో రూ.9 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.6 కోట్లకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేశారు. సూర్యకళను అధికారికంగా అరెస్టు చేసినట్లు ఏసీబీ ధృవీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమ లావాదేవీలపై ఎవరికైనా సమాచారం ఉంటే, వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 9440440057 లేదా అధికారిక ఈమెయిల్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## క'ర్ణాటకం'పై మౌనమేల..?

**మొదటిపేజీ తరువాయి...**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కృష్ణాజలాల పరిరక్షణ గురించి 9 పేజీల లేఖ రాశారు. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణాజలాల వివాదంలో ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఈ లేఖలో వివరించారు. తాజాగా కృష్ణాజలాల వాడకానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఏపీ కూడా తన వాదన వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఇప్పుడు ట్రైబ్యునల్ ముందు తన తుది వాదనలను సమర్పించి అన్యాయమైన పునర్విభజనను నిరోధించాలని జగన్ కోరారు. తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని కేటాయించాలనే తెలంగాణ ప్రభుత్వ డిమాండ్ చేస్తోందని, ట్రిబ్యునల్ దీనికి అంగీకరిస్తే ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని జగన్ తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టుల పట్ల టీడీపీ నిర్లక్ష్య వైఖరిని బాబుకు రాసిన లేఖలో జగన్ గుర్తుచేశారు. గతంలో కూడా టిడిపి ప్రభుత్వ వైఖరి కారణంగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచడానికి కర్ణాటకకు అనుమతి ఇచ్చిందన్నారు. అలాంటి అన్యాయం ఈసారి జరగకుండా శ్రద్ధ వహించాలన్నారు. అలాగే 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వం కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర హక్కుల్ని కూడా తెలంగాణకు వదులుకుందన్నారు. మళ్ళీ ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని జగన్ ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. ఈ కీలక సమయంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రం పట్ల నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడాలని జగన్ కోరారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టిఎంసి నికర నీటిలో ఒక టిఎంసి అయినా కోల్పోయే పరిస్థితి తలెత్తినా, దానికి టిడిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఏపీ రైతుల ప్రయోజనాలు కాపాడటం చంద్రబాబు బాధ్యత అని, బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీలలో ఒక్క టీఎంసీ తగ్గినా ఏపీకి అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.




## పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

**ఆంధ్రప్రదేశ్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షలను మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు బోర్డు వెల్లడించింది.**

రోజూవారీగా ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల తేదీలను వెల్లడించడం ద్వారా విద్యార్థుల సన్నద్ధతకు స్పష్టత లభించింది. ప్రత్యేకంగా టైంప్‌టేబుల్ విడుదల కావడంతో రివిజన్ ప్లాన్లు రూపొందించుకోవడానికి విద్యార్థులకు అవకాశం దొరికింది. హాల్ టికెట్లు మరియు పరీక్షలకు సంబంధించిన ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in ను సందర్శించాలని అధికారులు సూచించారు. మార్చి 16న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1తో పరీక్షలు ప్రారంభమవుతాయి. మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్, మార్చి 20న ఇంగ్లీష్, మార్చి 23న గణితం పరీక్షలు జరగనున్నాయి. తర్వాత మార్చి 25న ఫిజిక్స్ (భౌతికశాస్త్రం), మార్చి 28న బయాలజీ (జీవశాస్త్రం), మార్చి 30న సోషల్ స్టడీస్ (సాంఘికశాస్త్రం) పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 31న ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ పేపర్-2, ఏప్రిల్ 1న OSSSC సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2తో పరీక్షలు ముగుస్తాయి. పరీక్షలు సమర్థవంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థులు ముందస్తుగా సన్నద్ధతతో ఉండాలని, పరీక్షల నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

## 'హౌసింగ్ ఫర్ ఆల్'



**అమరావతి (ఏడీఎన్ఎన్):**

**రాష్ట్రంలో పేదలందరికీ గృహం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయంలో టిడ్కో, గృహనిర్మాణ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.**

రానున్న మూడేళ్లలో మొత్తం 17 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, అర్హులైన పేదలకు అందించాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన 'హౌసింగ్ ఫర్ ఆల్' హామీ అమలు వేగవంతమైందని, ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. 2029 జనవరి నాటికి మొత్తం లక్ష్యాన్ని సాధించేందుకు శాఖలు సంకల్పంతో పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నదని, అందులో మిగిలిన 17 లక్షలను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల గృహప్రవేశాలను నిర్వహించేందుకు సిద్ధం కావాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేను వేగంగా పూర్తి చేసి, గ్రామాల్లో అర్హుల జాబితాలను ప్రదర్శించాలని సూచించారు. "ప్రజలు సంతృప్తి చెందితేనే నాకు సంతృప్తి. లబ్ధిదారులు స్థలం కోరితే కేటాయించండి. సొంత స్థలం ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి. అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి" అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 1.0) కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు సాయాన్ని ముస్లిం మైనార్టీలకు కూడా వర్తింపజేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దీనితో 18 వేల ముస్లిం లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున అదనపు సాయం అందనుందని, ఇందుకోసం రూ. 90 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. గత ప్రభుత్వ చర్యల వల్ల 2014-19 కాలంలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీమ్ కింద రూ. 920 కోట్ల బిల్లులు నిలిచిపోయాయని సీఎం ప్రస్తావించారు. వీటిని రికవరీ చేయడానికి కేంద్రంతో చురుకైన చర్చలు జరపాలని అధికారులు సూచించారు. గతంలో నరేగా బిల్లులను ఎలా రాబట్టారో అదే విధంగా ఈ బిల్లుల విషయంలోను ప్రయత్నించాలని సూచించారు. సమావేశంలో అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, 2014-19 మధ్య: 8 లక్షల ఇళ్ల నిర్మాణం, 2019-24 మధ్య: 5.80 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తైంది. ఈ సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, టిడ్కో మరియు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హిడ్మా స్థానంలో ఆ పూవర్తి బిడ్డే ?



**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

**హిడ్మా ఎన్ కౌంటర్ తో ఆస్థానాన్ని టాప్ కమాండర్‌గా కొనసాగుతున్న బర్సీ దేవా భర్తీ చేయబోతున్నాడనే ప్రచారం జోరుగా జరుగుతోంది. హిడ్మా సొంతూరు పూవర్తి గ్రామానికే చెందిన బర్సీ దేవా 30 ఏళ్లకు పైగా దళంలో కొనసాగుతున్నారు.**

హిడ్మాతో కలిసి చాలా ఆపరేషన్లలో సంయుక్తంగా పాల్గొన్నారు. ఇక మీదట హిడ్మా లేని లోటును బర్సీ దేవా పోషించబోతున్నారని వినికిడి. ప్రస్తుతం బర్సీ దేవా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న కొత్త కమాండర్ . ఆయనపై అటు మావోయిస్టులు, ఇటు పోలీసులు ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇదే అంశంపై సోషల్ మీడియాలో పోస్టులు సైతం చక్కర్లు కొడుతున్నాయి. మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా మృతితో , ఆ స్థానాన్ని భర్తీ చేసే ధీటైన నాయకుడు కోసం మావోలు ఎదురుచూస్తున్నారు. మావోయిజంలో హిడ్మా పేరు మార్మోగింది. దండకారణ్యంలో కీలకమైన నాయకుడు కావడంతో ఆయన స్కెచ్ వేస్తే కచ్చితంగా పని జరగాల్సిందే. చురుకైన మావోయిస్టు నేత హిడ్మా మరణంతో మావోయిస్టు దళం నడిపించే నాయకుడు లేక దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటుంది. పార్టీకి కోలుకోలేని దెబ్బ పడడంతో మావోయిస్టుల ఉనికిని కోల్పోయే ప్రమాదంలో ఉందంటూ చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో మరో కీలక మావోయిస్ట్ నేత బర్సీ దేవా పేరు తెరపైకి వచ్చింది.

### సీఎం ఫ్యామిలీకి బెదిరింపు కాల్స్

## ఉలిక్కిపడ్డ ఏపీ

**మొదటిపేజీ తరువాయి...**

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో తమ కుటుంబం ఎదుర్కొన్న కష్టాలను ఆమె గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు రాజమండ్రి జైలులో నిర్బంధించిన ఘటన తమ కుటుంబానికి మానసికంగా తీవ్రమైన దెబ్బ ఇచ్చిందని భువనేశ్వరి పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రజలు తమకు భరోసా ఇచ్చిన తీరు జీవితాంతం మరిచిపోలేనిదని అన్నారు. ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, భువనేశ్వరి చేసిన ప్రకటనలు ఆశ్చర్యాన్ని రేపుతున్నాయి. ముఖ్యమంత్రి భార్యగా, కేంద్రంలో కూడా ప్రభావం చూపగల స్థాయిలో ఉన్న ఆమె ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేశారన్నది టీడీపీ వర్గాల్లో ప్రశ్నార్థకంగా మారింది. ఆమె ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు? ఈ బెదిరింపుల వెనుక ఎవరున్నారు? అన్న అంశాలపై పార్టీ శ్రేణులలో చర్చలు కొనసాగుతున్నాయి.

## మంగళగిరిలో రత్నాల ఫ్యాక్టరీ

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

**గుజరాత్‌లోని సూరత్ నమూనాలో గుంటూరు జిల్లా మంగళగిరిలో రత్నాల ఫ్యాక్టరీను ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.**

మంత్రి నారా లోకేశ్ చొరవతో ఈ ఫ్యాక్టరీ, క్లస్టర్ స్థాపనకు అవసరమైన 12 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించినట్లు తెలిపారు. విజయవాడలో, ఏపీ బులియన్, గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ - చెన్నైలోని యునైటెడ్ ఎగ్జిబిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడురోజుల బీ2బీ జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను మంత్రి భరత్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల నుండి విచ్చేసిన జ్యూయలరీ వర్తకులను ఆయన అభినందించారు. రాష్ట్రంలో పరిపాలన సమర్థంగా సాగుతున్నందున వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు ఆసక్తి చూపుతున్నారని మంత్రి తెలిపారు. జ్యూయలరీ రంగంలో పోటీ ఎంత ఉన్నా, ప్రతి వ్యాపారికి తమకంటూ ప్రత్యేకత ఉండడంతో లాభదాయకతపై ప్రభావం ఉండదని చెప్పారు. అమరావతిలో త్వరలోనే లక్ష చదరపు అడుగుల కన్వెన్షన్ సెంటర్‌ను ఆధునిక సౌకర్యాలతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీనికి అవసరమైన 10 ఎకరాల స్థల కేటాయింపునకు మున్సిపల్ శాఖ మంత్రిని కోరినట్లు చెప్పారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు అత్యాధునిక నగల డిజైన్‌లు, సాంకేతికతల గురించి వ్యాపారులకు అవగాహన పెంచుతాయని మంత్రి తెలిపారు.



ప్రాంతీయ వ్యాపారులకు తమ ప్రాంతంలోనే అత్యుత్తమ నగలు అందుబాటులో ఉండేలా ఈ చర్యలు దోహదపడతాయని ఏపీ బులియన్, గోల్డ్, సిల్వర్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ పేర్కొన్నారు.

## నరసరావుపేటలో వరుస దొంగతనాలు

- **నలుగురు అరెస్టు, రూ.80 లక్షల ఆభరణాల స్వాధీనం**

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**

**పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలను చేధించినట్లు పోలీసులు ప్రకటించారు.**



ఈ నేపథ్యంలో దొంగతనాలకు పాల్పడుతున్న వంశీ (24), బాలయ్య (19), తిరుపతి రావు (34) రాజేశ్ (24) నలుగురు నిందితులను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.80 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు శుక్రవారం జరిగిన పత్రికా సమావేశంలో వెల్లడించారు. నిందితులు నరసరావుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాలతో పాటు వినుకొండలో కూడా చోరీలకు పాల్పడ్డారు. మొత్తం ఆరు చోట్ల దొంగతనాలు చేసినట్లు విచారణలో తెలిసింది. సిమెంట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కార్మికుల ఇళ్లను ప్రత్యేకంగా టార్గెట్ చేసి, రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 4 నుంచి 9 వరకు వరుసగా జరిగిన ఈ దొంగతనాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక సాక్ష్యాలు, పరిసరాల పరిశీలన ఆధారంగా నిందితులను అరెస్టు చేసి, కేసును విజయవంతంగా ఛేదించామని ఎస్పీ తెలిపారు. నిందితులపై సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకుని, దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వం, మోసం కవల పిల్లలు



**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

**ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని , మాజీమంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం, మోసం రెండూ కవల పిల్లల్లా మారిపోయాయని, అన్నం పెట్టే రైతులను చంద్రబాబు సర్కారు దారుణంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆమె విమర్శించారు.**

ముఖ్యంగా మామిడి రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టకపోవడంతో సుమారు 45 వేల మంది రైతులు రూ.180 కోట్లు నష్టపోయారని రోజా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న సమయంలో, వారిని ఆదుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రత్యక్షంగా పర్యటనకు సిద్ధమయ్యారని ఆమె గుర్తుచేశారు. దీంతో భయపడిన కూటమి ప్రభుత్వం హడావుడిగా చర్యలు తీసుకుని, 4.50 లక్షల టన్నుల తోతాపురి మామిడిని ఫ్యాక్టరీలకు తరలించిందని తెలిపారు. అప్పుడు కిలో మామిడికి ప్రభుత్వం రూ.4, ఫ్యాక్టరీలు రూ.8 చెల్లించి మొత్తం రూ.12 ధర ఇస్తామని రైతులకు హామీ ఇచ్చిందని రోజా పేర్కొన్నారు. అయితే నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదని ఆమె ఆరోపించారు. రైతు సంఘాలు ఆందోళనలు ప్రారంభించాక ప్రభుత్వం తన వాటా రూ.180 కోట్లు విడుదల చేసినా, ఫ్యాక్టరీలు చెల్లించాల్సిన రూ.360 కోట్లు ఇప్పటికీ రైతుల చేతికి రాలేదని విమర్శించారు. పైగా, ఫ్యాక్టరీ యాజమాన్యాలు హామీ ఇచ్చిన రూ.8 బదులుగా కేవలం రూ.3 నుంచి రూ.4 మాత్రమే చెల్లిస్తున్నాయని రైతులు తనతో పంచుకున్న ఆవేదనను రోజా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ఫ్యాక్టరీల నుంచి రైతులకు రావాల్సిన మొత్తం రూ.360 కోట్లను కిలోకు రూ.8 చొప్పున తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రోజా డిమాండ్ చేశారు. రైతుల న్యాయమైన పోరాటానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు.




## వెలుగులోకి జీడీసీసీ బ్యాంకు అక్రమాలు

**గుంటూరు జిల్లా (ఏడీఎన్ఎన్) :**

**గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో భారీ అక్రమాలు వెలుగులోకి రావడంతో, నల్లపాడు శాఖలో అవకతవకలకు పాల్పడిన వారిపై అధికారిక చర్యలు ప్రారంభమయ్యాయి. జీడీసీసీ బ్యాంకు పాలకవర్గం సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్రమాల్లో భాగస్వామ్యులైన 796 మందిపై సివిల్ కేసులు, 186 మందిపై క్రిమినల్ కేసులు, అలాగే 27 మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని తీర్మానించింది.**


వైసీపీ ప్రభుత్వ కాలంలో గుంటూరు రూరల్ మండలం నల్లపాడులో వివిధ రకాల రుణాల మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో, జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కమిటీ చేసిన దర్యాప్తులో రూ.22.25 కోట్ల అవకతవకలు బయటపడ్డాయి. ఇందులో భాగంగా శీతల గోదాముల్లో ఉన్న సరుకుపై మంజూరు చేసిన ప్లెడ్జ్ రుణాల్లో రూ.13.15 కోట్లు, స్వయం సహాయ సంఘాలకు బోగస్ రుణాలుగా రూ.7.46 కోట్లు ఇచ్చినట్లు తేలింది. అదేవిధంగా 'జగనన్న మహిళా ధీమా' పథకం కింద రూ.1.2 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా మంజూరైనట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పాలక మండలి ఈ అక్రమాలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో బ్యాంకు జీఎంలుగా పని చేస్తున్న టి. కృష్ణవేణి, సి. హెచ్. అజయ్ కిషోర్ కుమార్లను సస్పెండ్ చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. వీరిద్దరూ గతంలో సీఈవో, నోడల్ అధికారులుగా ఉండగా ఈ అక్రమాలు చోటుచేసుకున్నట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం జీఎంలుగా పనిచేస్తున్న వీరిపై క్రమశిక్షణాత్మక చర్యలు ప్రారంభించనున్నారు. ఇకపోతే వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న 27 మంది ఉద్యోగులపై కూడా శాఖాలోపాల కారణంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. అవకతవకల్లో పలువురు స్థానిక వైకాపా నాయకులు కూడా ప్రమేయం ఉన్నట్లు తేలడంతో, వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని పాలక మండలి భావించింది. గుంటూరు జీడీసీసీ బ్యాంకులో జరిగిన ఈ భారీ అక్రమాలు జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. అధికారులు ప్రతి దశలోనూ నిఘా ఉంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.



## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

**రాజమండ్రి (ఏడీఎన్ఎన్) :**

గ్రామాల అభివృద్ధే తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన కడియపులంక, జేగురుపాడు పాములమెట్ట ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా పల్లాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కడియపులంకలో పంచాయతీ నిధులతో నిర్మించనున్న పలు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాల నిర్మాణం త్వరితగతిన కొనసాగుతున్నట్టు అన్నారు. పాములమెట్టలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించే ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. చైతన్యనగర్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి చైతన్యనగర్-పాములమెట్ట ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే పుష్కరాల నాటికి శాతానికి శాతం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, పాతూరి రాజేష్, పాటంశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు, బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, చెల్లుబోయిన శ్రీను, ముద్రగడ జమీ, నాగిరెడ్డి రామకృష్ణ తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## సీఎస్ విజయానంద్ సర్వీసు పొడిగింపు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఏపీ సీఎస్ విజయానంద్ సర్వీసుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూడు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరుతో విజయానంద్ సర్వీసు ముగిసిపోనుంది. దీంతో 2026 ఫిబ్రవరి వరకు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి తర్వాత రాష్ట్ర స్పెషల్ సీఎస్‌గా సాయి ప్రసాద్‌కు అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. 2026 మే నెలతో ఆయన సర్వీసు సైతం ముగియనుంది. అయితే మే తర్వాత కూడా సాయి ప్రసాద్‌ను సీఎస్‌గా కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు వాళ్లిద్దరికి ప్రభుత్వం నుంచి సమాచారం చేరినట్లు ప్రచారం జరుగుతోంది.



# కేటీఆర్ ఆరోపణలు సత్యదూరం

◆ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**పారిశ్రామిక భూములకు సంబంధించి కేటీఆర్ చేసిన ఆరోపణలు సత్యదూరం అని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొట్టిపారేశారు.**

ఇండస్ట్రీయల్ పాలసీపై కాంగ్రెస్ ప్రభుత్వం గురించి కేటీఆర్ అవస్తవాలు మాట్లాడారని ఖండించారు. మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి ఇంపాక్ట్ ఛార్జీలు వసూలు చేయాలని కొత్త పాలసీ తీసుకొస్తే... లక్షల కోట్ల స్కామ్ అంటూ కేటీఆర్ అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆజమాబాద్, కూకట్ పల్లి, హఫీజ్ పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించినది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. యాజమాన్య హక్కులు ఉన్నవారికి మాత్రమే ఇపుడు భూ వినియోగ మార్పిడి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ. 5 వేల కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. అంతేగాని, కేటీఆర్ చెప్పినట్టు లక్షల కోట్ల కుంభకోణం జరగలేదన్నారు. కేటీఆర్ మాట్లాడిన వ్యక్తులు ప్రభుత్వంలో లేరని, ఒకవేళ ఎవరైనా ఒప్పందం చేసుకుంటే ఆధారాలు బయట పెట్టండి.. ఎలాంటి చర్యలు తీసుకుంటామో చూడండన్నారు.




# నార్త్ ఈస్ట్ చిత్రోత్సవాన్ని ఆరంభించిన గవర్నర్

తెలంగాణ–ఈశాన్య రాష్ట్రాల సినీ బంధానికి నాంది

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**తెలంగాణఈశాన్య రాష్ట్రాల చిత్రోత్సవాన్ని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించి, త్రిపుర చిత్రమైన 'యార్వింగ్' తొలి ప్రదర్శనను వీక్షించారు.**

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణల మధ్య సాంస్కృతిక, సాంకేతిక, యువశక్తి, మహిళా సాధికారత, ఐటీ, ఆరోగ్య రంగాల్లో విస్తృత భాగస్వామ్యానికి ఈ వేదిక తోడ్పడుతుందని తెలిపారు. ఈశాన్య భారత వైవిధ్యం, తెలంగాణ చైతన్యం కలిస్తే మరింత బలోపేతమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ మీడియా ద్వారా అడవి కొండల్లోని దూర గ్రామాలవరకు కూడా తెలుగు సినిమాలు చేరి విపరీతమైన ఆదరణ పొందుతున్నాయని, ఇది సినీ శక్తికి నిదర్శనం అని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్, సమాచార శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు, దర్శకులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు పన్నెండు చిత్రాల ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయి. త్రిపుర, మణిపూర్, అస్సాం, మేఘాలయ, సిక్కిం, తెలంగాణ నుండి ఎంపిక చేసిన 12 చిత్రాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణ వైపు నుండి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందిన నా బంగారు తల్లి, పొట్టేల్, మల్లేశం, బలగం చిత్రాలు ప్రదర్శించబడతాయి



# నాగార్జునసాగర్ కుడికాల్వకు గండి.. టెన్షన్ లో ప్రజలు

నాగార్జున సాగర్ (ఏడీఎన్ఎన్) :

నాగార్జున సాగర్ కుడి కాలువ గట్టుకు కారంచేడుమాచర్ల మధ్య గండి పడింది. దీనితో అక్కడి 20 గ్రామాల ప్రజలు ముంపు భయంతో టెన్షన్ పడుతున్నారు. కారంపూడి ఎస్కేప్ ఛానల్ వద్ద గండి పడడంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగిపోతోంది. దీనితో శుక్రవారం ఈ గండిని పూడ్చేందుకు ప్రజలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన గండి పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్ట్ వద్ద నీటిని నిలుపు చేయాలని వారు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే ఎగువ ప్రాంతాల రైతులు నీటి కోసం గండ్లు పెట్టడం సాధారణంగా తరచూ జరుగుతుందని, అయితే భారీ గండి పడడం వల్ల నాగులేటి వాగులోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని స్థానికులు చెప్తున్నారు. వీరుల తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాలలోకి ఇప్పటికే నీరు చేరడంతో భయాందోళనలకు గురవుతున్నారు ప్రజలు.

# తెలంగాణ గ్లోబల్ గ్రోత్ ఇంజన్

◆ జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):

**తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్లో విద్య, నైపుణ్యాలు, ఉపాధికి పెద్దపీట వేస్తున్నాం, తెలంగాణ గ్లోబల్ గ్రోత్ ఇంజన్ కావాలి, ఆ ఇంజన్‌ను ఈఈముందుకు నడిపేది జేఎన్టీయూ అనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.**




శుక్రవారం జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించి, పూర్వ విద్యార్థులను సన్మానించిన అనంతరం ప్రసంగించారు. గత అరవై ఏళ్లలో లక్షలాది ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, పరిపాలకులు, స్వప్నదృష్టులను తీర్చిదిద్దిన ఈ పవిత్ర స్థలంలో నిలబడి మాట్లాడటం ఒక అపూర్వమైన ఆనందం అని డిప్యూటీ సీఎం అన్నారు. జేఎన్టీయూ సంస్థకు భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరు ఉండడం ఎంతో సార్థకమైందనీ అభిప్రాయ వ్యక్తం చేశారు. ఎందుకంటే, భారత భవిష్యత్తు విజ్ఞానంపై, ఆధునిక సంస్థలపై, యువత ధైర్యంపై నిర్మితమవుతుందని పండిట్ జవహర్లాల్ నెహ్రూ విశ్వసించారు అని తెలిపారు. సాంకేతిక విశ్వవిద్యాలయాలు దేశ పురోగతికి ఇంజిన్‌గా మారాలి అని ఆయన కలగన్నారు, 1965లో నాగార్జునసాగర్ ఇంజనీరింగ్ కాలేజ్‌గా ప్రారంభమై, 1972లో దేశ మొదటి సాంకేతిక విశ్వవిద్యాలయంగా ఎదిగి, నేడు 100 ఎకరాల కూకట్‌పల్లి క్యాంపస్‌గా ప్రపంచ ఖ్యాతిని పొందింది అన్నారు. జేఎన్టీయూ యొక్క న్యాయమైన సమస్యలైన భూమి లీజ్ సమస్య పరిష్కారం, లీజ్ రెంట్, ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పునరుద్ధరణకు రూ. 800 కోట్లు వీటన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుంది అన్నారు.

# చారిత్రక నాణేల జాతీయ సదస్సు



◆ బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో చారిత్రక నాణేల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో 107వ వార్షిక జాతీయ నాణేల సదస్సు, సెమినార్‌ను నిర్వహించనున్నారు.**

ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ఆవిష్కరించారు.,న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా (NSI) సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణేల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నాణేల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో డిసెంబర్ 11, 12 న రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుందని తెలిపారు. భారత దేశ నలుమూలల నుంచి విద్యార్థులు, స్కాలర్స్, పరిశోధకులు (రీసర్చర్స్), న్యూమిస్‌మటిక్స్ నిపుణులు పాల్గొనే ఈ సదస్సు, నాణేల చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక ప్రాముఖ్యతపై చర్చించేందుకు ఒక వేదికగా ఉపయోగపడనుందని ఆయన తెలిపారు.,ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డిప్యూటీ డైరెక్టర్లు డా. డి. రాములు, డా. పి. నాగరాజు పాల్గొన్నారు.

# ఐదు లక్షల కోట్ల భూ కుంభకోణం

**మొదటిపేజీ తరువాయి...**

"కేవలం ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ విలువలో 30% మాత్రమే చెల్లిస్తే చాలు అన్నట్టుగా పాలసీ తీసుకొచ్చారు. ఇది సూటిగా భూముల కబ్జాకు పెట్టిన పథకం" అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కనీసం 100 శాతం నుంచి 200 శాతం వరకు ఎస్ఆర్ఓ విలువ చెల్లించాలని నిబంధనలు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అయితే అవినీతిని ప్రోత్సహించేలా కేవలం 30 శాతం కే అనుమతులు ఇస్తోందని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ భారీ స్కామ్‌కు ప్రణాళిక సిద్ధమైందని కేటీఆర్ ఆరోపించారు. ఈ పాలసీని ప్రకటించే ముందు నుంచే రేవంత్ రెడ్డి అన్నదమ్ములు, అతని అనుచరులు సంబంధిత భూములకు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. "అందుకే వేగంగా ఏడు రోజుల్లో అప్లికేషన్లు, మరో ఏడు రోజుల్లో ఆమోదం, 45 రోజుల్లో రెగ్యులరైజేషన్ కార్యక్రమం చేపట్టారు. ఇది పూర్తిగా ప్లాన్డ్ స్కామ్" అని విమర్శించారు. ఈ పాలసీ పారిశ్రామికవేత్తలకు భారీ ప్రమాదం తీసుకురావచ్చని హెచ్చరించిన కేటీఆర్, "ఇప్పుడే కొనుగోలు చేసినా, రెగ్యులరైజేషన్ చేసుకున్నా,భవిష్యత్తులో పెద్ద ఇబ్బందులు తప్పవు. ఈ పాలసీ కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రికి ఏటీఎం లాంటిది మాత్రమే" అన్నారు. భూములు రెగ్యులరైజ్ అయినా భవిష్యత్ ప్రభుత్వాలు విచారణ జరపకుండా ఉండబోవని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ లావాదేవీలన్నింటినీ పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధి కోసం రూపొందించిన టీఎస్ఐపాస్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూముల విక్రయాలకు దుర్వినియోగం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తిని అప్పనంగా తీసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, దీనిని బీఆర్ఎస్ తీవ్రంగా ఎదిరిస్తోందని తెలిపారు.

# మద్యం, బాటిళ్లు, గంజాయి స్వాధీనం



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):

**గోవా, ఢిల్లీ నుంచి ఎయిర్ లైన్ ద్వారా తీసుకవచ్చిన ఎన్‌డీపీఎల్ నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ ను ఖమ్మంలో భారీగా గంజాయి ని ఏక్సైజ్ అధికారులు పట్టు కున్నారు. 30.5 కేజీల గంజాయి స్వాధీనంతో పాటు ముగ్గురిని అరెస్టు చేశారు.**

ఖమ్మం ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది, సీఐ శ్రీనివాస్ ఏదిలాపురం మునిసిపాలిటీ రాళ్లవాగు సమీపంలో అనుమానంగా మూటలతో ముగ్గరు వ్యక్తులు కనిపించగా వారి వద్దకు వెళ్లారు. వారి వద్ద ఉన్న సంచులను పరిశీలించగా గంజాయి ఉన్నట్లు ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. సంచుల్లో ఉన్న గంజాయిని తూకం వేయగా 30.5 కేజీల గంజాయిగా ఉన్నట్లు అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 16 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న క్రమంలో గంజయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.,ఈ గంజాయిని ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు తీసుక వెలుతున్న ముగ్గురు వ్యక్తుల్లో మహారాష్ట్రకు చెందిన రాహుల్ అశోక్ అన్వాల్, సంకేత్ బాల సాహెబ్ లోద్వాల్, హరిచంద్ర కిశోర్ లోంకర్‌లను అరెస్టు చేసి ఖమ్మం 2 ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.,గంజాయిని పట్టుకున్న వారిలో సీఐ శ్రీనివాస్‌తోపాటు సుధీర్, వెంకట్, విజయ్‌కుమార్, హన్మంతరావు, ఉపేందర్, వీరబాబు ఉన్నారు. గంజాయి పట్టుకున్న టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసం, ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్థన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్ ఎక్సైజ్ సూపరిటెండ్ తిరుపతి అభినందించారు. ఎస్టీఎఫ్ ఏ టీమ్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి రోడ్డుపై వాహనాల తనిఖీలు చేస్తుండగా 41 మద్యం బాటిళ్లు లభించాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తీసుక వచ్చిన మద్యాన్ని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపర్డెంట్ అంజిరెడ్డి తెలిపారు .

# నాన్ డ్యూటీ పై లిక్కర్ అరికట్టండి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**ఎక్సైజ్ భవన్ లో అన్ని శాఖల అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన ఏక్సైజ్ అధికారులకు పలు సూచనలు చేశారు.,నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టి..కొత్త మద్యం పాలసీలో వచ్చే మద్యం షాపులకు అమ్మకాలు పెరిగే విధంగా ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌లు పని చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెకట్రరీ రఘునందన్‌రావు అదేశించారు.**



ఎక్సైజ్‌శాఖకు ప్రిన్సిపల్ సెకట్రరీ రిజ్వీ స్థానంలో వచ్చిన రఘునందన్‌రావు గురువారం ఎక్సైజ్‌శాఖలోని కీలక శాఖలతో సుదీర్ఘంగా సమీక్షానిర్వహించారు. అబ్కారీ భవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ప్రిన్సిపల్ సెకట్రరీ రఘునందన్‌రావు తో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్ పాల్గొన్నారు.,తొలిసారిగా ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఆయన ఎక్సైజ్ శాఖ పనితీరు, తెలంగాణ బేవరీజెస్ అమ్మకాలు, మద్యం తయారీ కంపెనీల తయారీ, వినియోగం, లెబుల్స్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ పనితీరుపై పీపీటీలో ప్రదర్శించిన వివరాలను పరిశీలించారు.,పీపీటీ వివరాలను కమిషనర్ హరికిరణ్ ప్రిన్సిపల్ సెకట్రరీకి వివరించారు. ప్రిన్సిపల్ సెకట్రరీ సూచించిన వివరాలను సంబంధింత అధికారులు ఈ సందర్భంగా నోటు చేసుకున్నారు.తెలంగాణ ఎక్సైజ్ ఆదాయానికి గండికొడుతున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని ప్రిన్సిపల్ సెకట్రరీ రఘునందన్ రావు అదేశించారు.,నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టడం వల్ల ఎక్సైజ్ శాఖకు ఆదాయం రావడంతోపాటు మద్యం షాపుల అమ్మకాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో పక్కా ప్రణాళికలతో ముందుకు పోవాలని ఆయన సూచించారు.,గీతా కార్మికుల చని పోయినపుడు, ప్రమాదాల్లో గాయపడిన సంఘటనలో సకాలంలో పరిహారం చెల్లింపుల పై ఆయన ప్రశ్నించారు. బడ్జెట్ రాక పోవడంతో కొందరికి పరిహారం చెల్లించలేక పోతున్నామని అధికారులు తెలిపినపుడు అందరికి పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని, గీతా కార్మిక కుటుంబాలను అదుకోవాలని ఆయన సూచించారు. గీతా కార్మికులకు చెల్లించే పెన్షన్ వివరాలను రికార్డుల్లో రాయడం కన్న వారికి అందుతున్నాయా లేదా ? అనే విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిన చేయాలన్నారు. చనిపోయిన వారి స్థానంలో కొత్తవారికి పెన్షన్ అందించడానికి కృషి చేయాలన్నారు.,మద్యం సరఫరాలో లెబుల్, బార్‌కోడిరగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని, ఈ వెంట్ పర్మిషన్ల జారీలో మార్పులు చేర్పులు చేయాలని, కొత్త పరిశ్రమలకు అవసరమైన లైసన్స్‌లను త్వరితగతిన జారీ చేయాలని , కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంబానికి ముందు ఏర్పాట్లను పరిశీలించాలని, చెక్ పోస్టులను పటిష్టం చేయాలని, మద్యం తయారీ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన సూచించారు. సమావేశంలో అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్, ఎస్టీఎఫ్ అసిస్టెంట కమిషనర్ ప్రణవి, శ్రీధర్ (లెబుల్), శీలం శ్రీనివాస్ (లీగల్), శ్రీనివాస్‌లతోపాటు అసిస్టెంట్ సర్వీసెస్ నాగలక్ష్మీ, టీజీబీసీఎల్ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరావు, ప్రమోద్, లు పాల్గొన్నారు.



# ఎంపీ చామల చొరవతో తీరిన సమస్యలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చొరవతో ప్రజా సమస్యలు అనేకం పరిష్కారం అయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ముత్తిరెడ్డిగూడెం క్రాసింగ్ వద్ద రైల్వే అండర్‌పాస్ కోసం ప్రజలు సంవత్సరాలుగా చేస్తున్న డిమాండ్‌ను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పరిష్కరించారు.**

ప్రజల విజ్ఞప్తుల మేరకు, ఆయన స్పందించారు. సహకారం కోసం ఆయన అధికారులను సంప్రదించారు. ఫలితంగా ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యాయి. ముట్టిరెడ్డిగూడెంలో రైల్వే అండర్‌పాస్ మంజూరు అయింది. దాంతో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు, వృద్ధులు మరియు ప్రతి రోజు రైలు ట్రాక్‌ను దాటే ప్రయాణికులకు శాశ్వతమైన, ఇబ్బందులు తొలగి పోయాయి. ఎమ్ ఎమ్ టీ ఎస్ పనుల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అధికారులు ఆదేశాలిచారు.,దెబ్బతిన్న రోడ్లను తక్షణం మరమ్మతు చేయడం, రైల్వే నిర్మాణాల సామగ్రి రవాణా కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించడం,,గ్రామస్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలకు అధికారులు శ్రీ కారం చుట్టారు. ఎల్ సీ నెంబర్ 31 వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కూడా సాధ్యమేనని రైల్వే అధికారులు ధృవీకరించారు.,ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముట్టిరెడ్డిగూడెం గ్రామ మరియు పరిసర ప్రాంత ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకొని రైల్వే శాఖ అత్యంత వేగంగా స్పందించిందని తెలిపారు. రైల్వే అండర్‌పాస్ ఆమోదం మరియు రోడ్ల మరమ్మతులకు హామీ ఇవ్వడం ద్వారా ప్రజా రక్షణ, రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్న చామల పనులు వేగంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.







# రామానాయుడు, అన్నపూర్ణ స్టూడియోలకు జీహెచ్ఎంసీ నోటీసులు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియో, అన్నపూర్ణ స్టూడియోలకు జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు పూర్తిస్థాయిలో చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్కువగా చెల్లిస్తున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్ 18 అధికారులు గుర్తించారు. వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా పన్నులు ఎగవేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో అధికారులు నోటీసులు జారీచేశారు. కాగా, అన్నపూర్ణ స్టూడియో రూ.11.52 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉండగా రూ.49 వేలు మాత్రమే చెల్లిస్తోంది. ఇక రామానాయుడు స్టూడియో రూ.1.92 లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే రూ.1900 మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.




# బ్యాంకు అధికారులతో ఎంపీ మల్లు రవి సమావేశం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులతో పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.**

పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు విస్తరించే దిశగా బ్యాంకులు ముందుకు రావాలని కోరారు. యువత ఆర్థికంగా ముందుకు సాగేందుకు రుణాల ప్రదానం కీలకమని, అందుకు బ్యాంకులు సులభ రుణాల మంజూరు ప్రక్రియను కొనసాగించడంతో పాటు, అర్హులైన యువతకు ప్రత్యేక మార్గదర్శకత ఇవ్వాలని ఎంపీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశలో బ్యాంకుల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. యువతను చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, సేవా రంగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రోత్సహించేలా ప్రత్యేక రుణ పథకాలను అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటామని బ్యాంకు అధికారులు ఎంపీకి హామీ ఇచ్చారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
22.11.2025
www.manasarkar.com

## రాశి ఫలాలు

**22-11-2025 శనివారం**

**మేషం:**
రావలసిన డబ్బు చేతికందుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి, ఉద్యోగాలు సానుకూలంగా సాగుతాయి. వ్యాపారాల్లో లాభాలు పెరుగు తాయి. ఆర్థిక పరిస్థితికి ఢోకా ఉండదు. ఆరోగ్యం బాగానే ఉంటుంది. ఆశించిన శుభవార్తలు వింటారు.

**వృషభం:**
అపార్థాలు, విభేదాలు విషయంలో బంధువులతో ముఖాముఖీ తేల్చుకోవడం మంచిది. వ్యాపారాల్లోనూ, ఆర్థిక విషయాల్లోనూ మిమ్మల్ని మించినవారుండరు. ఉద్యోగంలో భారీ లక్ష్యాలు, గడువుల వల్ల కొద్దిగా ఒత్తిడికి గురవుతారు. ఆర్థికంగా మరింత మెరుగైన స్థితి ఏర్పడుతుంది.

**మిధునం:**
ఉద్యోగంలో పనిభారం ఎక్కువగానే ఉంటుంది. ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడానికి కొందరు మిత్రులతో చేతులు కలుపుతారు. మీలోని నైపుణ్యాలకు పదును పెట్టడం మంచిది. ఆర్థిక లక్ష్యాల మీద మరింతగా శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

**కర్కాటకం:**
పని భారంతో పాటు, పెండింగ్ పనుల వల్ల కూడా ఇబ్బందులు కలుగుతాయి. కొద్దిగా ఓర్పు, సహనాలతో వ్యవహరించడం మంచిది. అదనపు ఆదాయ ప్రయత్నాల మీద దృష్టి పెట్టడం మంచిది. ఆర్థిక సంబంధ మైన కలలను సాకారం చేసుకోవడానికి సమయం బాగా అనుకూలంగా ఉంది. వృత్తి, వ్యాపారాల్లో కొద్దిపాటి లాభాలు కలుగుతాయి.

**సింహం:**
అదనపు ఆదాయ ప్రయత్నాలకు అవకాశం ఉండకపోవచ్చు. కుటుంబపరంగా కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. ఉద్యోగంలో అధికారులు, సహోద్యోగులతో ఉన్న సమస్యలు సర్దుకుంటాయి. ఉద్యోగ జీవితం సాఫీగా, సానుకూలంగా సాగిపోతుంది. రావలసిన డబ్బు చేతికి అందుతుంది.

**కన్య:**
ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో మీకున్న సామర్థ్యం వల్ల ఆర్థిక లక్ష్యాలను చేరుకుంటారు. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాల్లో ఆశాభంగాలు కలిగితే నిరుత్సాహపడవద్దు. ఉద్యోగంలో కొన్ని ఆశ్చర్యకర పరిణామాలు చోటు చేసుకుంటాయి. తొందరపాటు మాటల వల్ల ఇబ్బంది పడతారు.

**తుల:**
ఆర్థికంగా, ఉద్యోగపరంగా, సామాజికంగా పురోగతి చెందుతారు. ఉద్యోగంలో పదోన్నతి సాధించాలన్న మీ కోరిక నెరవేరుతుంది. మీ ప్రయత్నాల వల్ల కుటుంబ పరిస్థితులు బాగా చక్కబడతాయి. బంధుమిత్రులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాల్లో ఒకటి రెండు శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి.

**వృశ్చికం:**
ఆదాయ ప్రయత్నాలు కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవచ్చు. కుటుంబ ఖర్చులు కూడా బాగా పెరుగుతాయి. తల్లి తండ్రులు, బంధువులతో ఉన్న సమస్యల్ని, వివాదాల్ని చాలావరకు పరిష్కరించుకుంటారు. వృత్తి, ఉద్యోగాల్లో పురోగతి ఉంటుంది. వ్యాపారాల్లో కొద్దిగా లాభాలు ఉండవచ్చు.

**ధనస్సు:**
ఆర్థిక విషయాల్లో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. సన్నిహితుల సహాయం తీసుకోవడం మంచిది. చిన్నచిన్న సమస్యల గురించి ఎక్కువగా ఆలోచించకపోవడం మంచిది. ఉద్యోగంలో ఏకాగ్రత తగ్గే అవకాశం ఉంది. వ్యక్తిగత సమస్యల నుంచి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి.

**మకరం:**
ఉద్యోగానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది. ఒకటి రెండు ఆకర్షణీయ ఆఫర్లు అందుతాయి. కొత్త ఆదాయ అవకాశాలు ఈ రోజు మీ ముందుకు వస్తాయి. అనుకున్న పనులు, వ్యవహారాలు అనుకున్నట్టు పూర్తవుతాయి. మీ తెలివితేటలు, నైపుణ్యాలు ఉద్యోగంలో పురోగతికి బాగా ఉపయోగపడతాయి.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాల్లో సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. వ్యాపారాలు బాగా బిజీగా సాగి పోతాయి. ఉద్యోగపరంగా, ఆర్థికంగా మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయ వృద్ధికి గట్టి ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. కొత్త పెట్టుబడి అవకాశాల మీద దృష్టి పెట్టడం మంచిది. కొద్ది శ్రమ, తెలివితేటలతో అనుకున్నవి సాధిస్తారు.

**మీనం:**
వృత్తి, వ్యాపారాల్లో లాభాలు పెరుగుతాయి. ఎంతో ఆత్మ విశ్వాసంతో వ్యవహరిస్తారు. ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీల్లో లక్ష్యాలను సాధిస్తారు. మీరు దూరదృష్టితో పెట్టిన పెట్టుబడులు బాగా కలిసి వస్తాయి. కుటుంబ జీవితం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగిపోతుంది.



# క్రేన్ కూలి టీచర్ మృతి

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**
ఏపీలో విషాదం చోటు చేసుకుంది. తరగతి గదిలోకి వెళ్తున్న టీచర్‌పై క్రేన్ కూలి ఆవిడ మృతి చెందారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరంలోని ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం కళావేదికను క్రేన్ సహాయంతో స్లాబ్ వేసేందుకు సామగ్రిని పైకి తరలిస్తుండగా ఒక్కసారిగా ప్రమాద వశాత్తు క్రేన్ కూలింది. అదే సమయంలో ఇంగ్లిష్ టీచర్ జోష్నా భాయ్ (45)పై సామగ్రి పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను వెంటనే తుని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు, సహచర టీచర్లు విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న హోంమంత్రి అనిత మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# పీపీపీ పద్ధతిలోనే మెడికల్ కాలేజీలు

**మొదటిపేజీ తరువాయి....**
ఆస్పత్రులలో 70శాతం పడకలను పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ మోడళ్లను పరిశీలించి, నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అనుసరించే ఆసుపత్రులకు ప్రత్యేక రేటింగ్ విధానం ఉండాలని, నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం సమగ్ర ప్రమాణాలు అమలు చేయాలని ఆదేశించారు. కుప్పంలో పైలట్‌గా అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్ ప్రాజెక్టు రాష్ట్ర వైద్యారోగ్య రంగంలో గేమ్ చేంజర్‌గా నిలవనుందని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దేశం మొత్తానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం ఉందని అన్నారు. కుప్పంలో ఇప్పటికే 3.38 లక్షల మందికి సంబంధించిన ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నామని, రిజిస్టర్ అయిన ప్రజలపై వివిధ వైద్య పరీక్షలు పూర్తి చేసి డిజిటల్ హెల్త్ రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వివరించారు. 49 వేల మంది రోగుల డేటా ఇప్పటికే సేకరించబడింది. బ్లడ్ ప్రొఫైల్, అనీమియా, కిడ్నీ, లివర్, కార్డియాక్, డయాబెటిస్ వంటి ఆరోగ్య సూచికల ఆధారంగా సమగ్ర ఆరోగ్య విశ్లేషణ జరుగుతోందని తెలిపారు. 2026 జనవరి 1 నుంచి ఈ ప్రాజెక్టును చిత్తూరు జిల్లా మొత్తం విస్తరించనున్నట్టు తెలిపారు. సంజీవని సమర్థంగా అమల్లోకి వస్తే ప్రభుత్వం చేసే వైద్య వ్యయం గణనీయంగా తగ్గుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. టాటా-బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పని చేస్తున్న ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు నెలకు సుమారు 12 లక్షల క్లెయిమ్‌లు వస్తుండగా, ప్రభుత్వం నెలకు రూ.330 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఏ వ్యాధికి ఏ ప్రాంతంలో ఎంత వ్యయం జరుగుతుందో విశ్లేషించి, ప్రివెంటివ్ మరియు క్యురేటివ్ పద్ధతులను బలోపేతం చేసి ప్రజల ఖర్చుతోపాటు ప్రభుత్వ వ్యయం కూడా తగ్గించేలా పనిచేయాలని సీఎం సూచించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

# తరగతి గదిలోనే విద్యార్థిని ఆత్మహత్య


**జంగారెడ్డిగూడెం (ఏడీఎన్ఎన్) :**
ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకున్న విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని తరగతి గదిలోనే ఆత్మహత్యకు పాల్పడటం అందరినీ కలచివేసింది. శుక్రవారం భోజన విరామ సమయంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన పొడపాటి కావ్య (15) జంగారెడ్డిగూడెం పట్టణంలోని గురుకుల పాఠశాలలో చదువుతోంది. భోజన విరామం సమయంలో విద్యార్థులంతా కాంటీన్‌కు వెళ్లిన సమయంలో, ప్లేట్ తీసుకొచ్చేందుకు కావ్య తరగతి గది వైపు వెళ్లింది. అయితే



తిరిగి భోజనానికి రాకపోవడంతో తోటి విద్యార్థుల్లో అనుమానం కలిగింది. కావ్యను తీసుకురావడానికి వెళ్లిన తోటి విద్యార్థులు తరగతి గదిలో ఆమె చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న దృశ్యాన్ని గమనించి షాక్‌కు గురయ్యారు. వారు వెంటనే కేకలు వేయడంతో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ పరిశీలనలు నిర్వహించారు. తోటి విద్యార్థులతో మాట్లాడి ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించారు. కావ్య కుటుంబ పరిస్థితులు కూడా విచారణాధికారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తండ్రి గంగాధర్ కారు డ్రైవర్‌గా పని చేస్తుండగా, తల్లి ఉష డయాలసిస్ చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థిని ఆత్మహత్యకు గల నిజమైన కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, స్కూల్ వాతావరణం, వ్యక్తిగత పరిస్థితులు వంటి అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

# ఆ ఇద్దరు.. పోలీసుల నిర్బంధంలో లేరు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**
మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సీనియర్ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో ఉన్నారనే ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు లేవని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కోర్టు జోక్యం చేసుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించింది. అయితే, భవిష్యత్తులో ఆధారాలు లభిస్తే కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు అవకాశం ఉన్నట్లు తెలిపింది. తిప్పిరి గంగాధర్ (తెలంగాణ, కోరుట్ల) , మల్లా స్నేహలత (హైదరాబాద్) దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో, దేవ్‌జీ , రాజిరెడ్డిలను హైకోర్టులో హాజరుపర్చాలని కోరారు. ఈ ఇద్దరిని పోలీసులు గుప్త నిర్బందంలో ఉంచారని పిటిషనర్లు ఆరోపించారు.




విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది జై భీమారావు వాదనలు వినిపిస్తూ, ఈ నెల 18న మావోయిస్టులు-పోలీసుల మధ్య జరిగిన కాల్పుల తర్వాత దేవ్‌జీ, రాజిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడుతూ తొమ్మిది మంది కీలక నేతలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించిన వీడియోను కోర్టు ముందు సమర్పించనున్నట్లు తెలిపారు. దీనితో విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గురువారం కొనసాగిన విచారణలో ధర్మాసనం ఆధారాలను సమర్పించాలని ఆదేశించగా, న్యాయవాది సమర్పించిన వీడియోలో సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు కోర్టు గుర్తించింది. అయితే, దేవ్‌జీ గురించి మీడియా ప్రతినిధులు అడగ్గా,తమ అదుపులో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పిన విషయాన్ని కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. మొత్తానికి, దేవ్‌జీ , రాజిరెడ్డి పోలీసుల నిర్బందంలో ఉన్నట్లు నిర్ధారించేందుకు సరిపడ ప్రాథమిక ఆధారాలు లేవని పేర్కొన్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం, ఈ దశలో వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

# దేవుడికి లేని కోపం మీకెందుకు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**
'వారణాసి' టైటిల్ గ్లింప్స్ ఈవెంట్‌లో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి హనుమాన్ గురించి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర వివాదాన్ని రేపుతున్నాయి. రాజమౌళి వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ నేతలు స్పందిస్తూ ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన సినిమాల విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పలువురు బీజేపీ నేతలు కూడా జక్కన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాద నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రాజమౌళికి మద్దతు ప్రకటించారు. రాజమౌళికి కౌంటర్‌గా వస్తున్న విమర్శలను సమాధానపరుస్తూ రామ్ గోపాల్ వర్మ 'X'లో సుదీర్ఘ పోస్ట్ షేర్ చేశారు. నాస్తికుడిగా ఉండడం భారతదేశంలో నేరం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేవుడిని నమ్మకపోయే హక్కును కూడా రక్షిస్తుంది. ఎవరికైతే దేవుడిపై నమ్మకం ఉందో, రా



జమౌళికి కూడా నమ్మకంలేదని చెప్పే హక్కు అంతే ఉంది," అని స్పష్టం చేశారు. రాజమౌళి సినిమాల్లో దేవుళ్లను చూపించడం నాస్తికత్వానికి విరుద్ధమని విమర్శించిన వారిపై కూడా ఆయన ఎద్దేవా చేశారు. "గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే గ్యాంగ్‌స్టర్‌గా మారాలా?" అని ప్రశ్నించారు. రాజమౌళి విజయాలే కొందరికి అసలు సమస్య అని వర్మ వ్యాఖ్యానించారు. "దేవుడిని ఎంతగానో ప్రార్థించినా విజయాన్ని అందుకోలేని వారు, దేవుడిని నమ్మకుండానే శిఖరాగ్ర విజయాలు సాధించిన రాజమౌళిని చూసి భయపడుతున్నారు. నాస్తికత్వం దేవుడిని తగ్గించదు. అది కొందరి అసూయను మాత్రమే బయటపెడుతుంది," అని వర్మ పేర్కొన్నారు. రాజమౌళి, దేవుడు ఇద్దరూ బాగున్నారని, వారిని అర్థం చేసుకోలేని వారే బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. రాజమౌళికి 'వారణాసి' సినిమా భారీ అదృష్టాన్ని తీసుకువస్తుందని, ఇతరులు అసూయతోనే తిప్పలు పడుతున్నారని వర్మ సెటైరిక్‌గా పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివాదానికి కారణమైన రాజమౌళి వ్యాఖ్యలు 'వారణాసి' ఈవెంట్‌లో వెలువడ్డాయి. టైటిల్ గ్లింప్స్ ప్రదర్శన సందర్భంగా టెక్నికల్ గ్లిచ్ రావడంతో వీడియో ఆగిపోయింది. అనంతరం మాట్లాడిన రాజమౌళి, "నాకు దేవుడంటే నమ్మకం లేదు. హనుమాన్ నడిపిస్తున్నారని నాన్న చెప్పగానే కోపం వచ్చింది," అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై VHP, రాష్ట్రీయ వానర సైన్యం సహా పలు హిందూ సంస్థలు మండిపడి, రాజమౌళిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాయి.

# ఐక్యతా స్ఫూర్తిని చాటే ఉత్సవాలివి

❖ తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**
తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ ఉత్సవం... తెలంగాణకు, ఈశాన్య రాష్ట్రాలకు మధ్య ఉన్న ఐక్యతా స్ఫూర్తిని చాటుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మన దేశ ఈశాన్య ప్రాంతం ఎంతో అందమైనది, విభిన్నమైనదని కొనియాడారు. పర్యావరణ సంపదతో పాటు సాంస్కృతిక చైతన్యం కలిగిన ప్రాంతం ఈశాన్య ప్రాంతం. ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో వెలుగులోకి రాని అంశాలు చాలా ఉన్నాయి. ప్రాంతీయ గుర్తింపు విషయంలో ఈశాన్య రాష్ట్రాల పౌరుల బాధను మన తెలుగు ప్రజలం సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ఈ వేడుకలను ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొన్నారు. 1970"లు , 80లలో ఉత్తరాది వారు మన దక్షిణాది వాళ్లందరినీ 'మద్రాసీలు' అని పిలిచేవారని సీఎం గుర్తుచేశారు. తెలుగువారికంటూ ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు, సంస్కృతుల మధ్య




తేడాను వివరించడం దక్షిణాది వారికి కష్టంగా ఉండేది. అయినా ఎకానమీ పరంగా, సాంస్కృతిక పరంగా, ఇతర రంగాల్లో దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మనం ఈశాన్య రాష్ట్రాల ప్రజలను, వారి సంస్కృతిని మరింత బాగా అర్థం చేసుకోవాలి. వారితో కనెక్టివిటీ పెంచుకోవాలి. అప్పుడే ఈశాన్య రాష్ట్రాలు కూడా అన్ని రంగాలలో మన దేశానికి మరింతగా తోడ్పాటు అందించే రాష్ట్రాలుగా మారతాయన్నారు. హైదరాబాద్‌లో ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, హెల్త్‌కేర్, టూరిజం, హాస్పిటాలిటీ, స్టార్టప్‌లు, క్రీడలు వంటి అన్ని రంగాలలో వారు సక్సెస్ అయ్యారు. తెలంగాణ సమాజంతో కలిసిపోయి, ఇక్కడ అభివృద్ధికి తోడ్పడుతున్న వారందరికీ ధన్యవాదాలు. భారతదేశంలో తెలంగాణ మీకు మరో ఇల్లు లాంటిది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోన్న భారత్ ఫ్యూచర్ సిటీలో, భారతదేశపు మొట్టమొదటి 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని' నిర్మించడానికి భూమి కేటాయిస్తామని ప్రకటిస్తున్నాం. ఈ అనుబంధ కేంద్రంలో ప్రతి ఈశాన్య రాష్ట్రం వారి సొంత భవనాలను నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తాం. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ , మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు వారి వారి ప్రత్యేక భవనంతో పాటు హాస్టల్ సౌకర్యం, ఆహారం, చేతివృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలు ఉంటాయి. తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్‌కు కల్చరల్ కనెక్ట్ ఈవేదికగా మొదలైంది. తెలంగాణ సోదరుడు త్రిపుర గవర్నరుగా పనిచేస్తున్నారు. త్రిపుర, తెలంగాణ మధ్య ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలి. ఇండియాలో తొలి నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే ప్రణాళికలను విజయవంతంగా ముందుకు తీసుకెళదాం. "తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్" టెక్నో కల్చరల్ ఫెస్టివల్ విజయవంతం కావడానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు.

# అయ్యో.. రు.500ల కోసం ఫ్రెండ్‌నే చంపేశారు

**నెల్లూరు (ఏడీఎన్ఎన్) :**



కోవూరు పట్టణానికి సమీపంలోని నేగురు కాలువ ప్రాంతానికి చెందిన రాజా, షాజహాన్ మంచి స్నేహితులు. ఇటీవల షాజహాన్ రాజా వద్ద అవసరానికి రూ.500 రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అయితే అది తిరిగి చెల్లించలేదు. గత నెల 25న రాజా, షాజహాన్‌తో పాటు తమ స్నేహితులు మస్తాన్, సుబ్బయ్య, పెంచలయ్య కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న రాజా, షాజహాన్‌ను రూ.500 బాకీ గురించి అడిగాడు. షాజహాన్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మద్యం మత్తులో ఉన్న రాజా, అతని స్నేహితులు మస్తాన్, సుబ్బయ్య, పెంచలయ్య కలిసి షాజహాన్‌పై తీవ్రంగా దాడి చేశారు.

**హత్య చేసి.. కాల్వలో మృతదేహం**
దాడిలో షాజహాన్‌కు గాయాలు కావడంతో స్నేహితులంతా కలిసి అతడిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే అర్ధరాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా నిందితులు మరోసారి షాజహాన్‌పై తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో షాజహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు షాజహాన్ మృతదేహాన్ని నిందితులు వేగురు కాలువలో పడవేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు



# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

❖ స్వాగతం పలికిన సీఎం, గవర్నర్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**
శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్, తదితరులు భారత రాష్ట్రపతిని సాదరంగా ఆహ్వానించారు. ఉదయం తిరుమలేశున్ని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు. తొమ్మిది రోజుల పాట జరిగే భారతీయ కళా మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.



# రికార్డ్ సృష్టించిన భారతీయ టెలివిజన్ రంగం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**
ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ఏటా నవంబర్ 21న ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ప్రపంచంలోనే భారత టెలివిజన్ రంగం రికార్డులు సృష్టించింది. దేశవ్యాప్తంగా 230 మిలియన్ల కుటుంబాల్లోని 90 కోట్ల మంది వీక్షకులను టెలివిజన్ నెట్‌వర్క్ కలుపుతోందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. 2025 మార్చి నాటికి దేశంలో 918 ప్రైవేట్ శాటిలైట్ ఛానళ్లు పనిచేస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది. దేశవ్యాప్తంగా 6.5 కోట్ల ఇళ్లలో డీడీ ఫ్రీ డిష్ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2014లో కేవలం 59 ఛానళ్లతో ప్రారంభమైన ఈ ఉచిత డీటీహెచ్ సేవ, 2025 నాటికి 482 ఛానళ్లకు విస్తరించడం విశేషం. 1959లో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన భారత టెలివిజన్.. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రసార నెట్‌వర్క్‌లలో ఒకటిగా నిలిచింది. భారత మీడియా, వినోద రంగం 2024లో దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.2.5 లక్షల కోట్లు అందించింది. ఇది 2027 నాటికి రూ.3 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. కేవలం టెలివిజన్, బ్రాడ్‌కాస్టింగ్ విభాగం నుంచే 2024లో దాదాపు రూ.68,000 కోట్ల ఆదాయం సమకూరింది. డిజిటల్ విస్తరణ, 4K ప్రసారాలు, స్మార్ట్ టీవీలు, 5G, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు ఈ వృద్ధికి మరింత ఊతమిస్తున్నాయి.

# జప్తు చేస్తే రచ్చ చేస్తా..

**మొదటిపేజీ తరువాయి...**
ఈ కేసుల కారణంగా తన కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెవిరెడ్డి వాపోయారు. తాను మౌనం పాటిస్తే ప్రజలు నిజంగానే తప్పు చేశానని భావించే ప్రమాదం ఉందని, అందుకే వాస్తవాలు వెల్లడించాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. "కూటమి ప్రభుత్వం సంతృప్తి చెందే వరకు నన్ను జైలులో పెట్టినా నేను భయపడను. ఎన్ని రోజులు కావాలంటేన్ని రోజులు జైలులో ఉండడానికి సిద్ధంగా ఉన్నాను" అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు.



# త్వరలో అధ్యాపక పోస్టుల భర్తీ

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**
అమరావతిలో విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాల నేతలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో విద్యాశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలను త్వరితగతిన విడుదల చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే వర్సిటీల్లో అధ్యాపక పదవుల భర్తీని వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో రాజకీయ ప్రసంగాలు, జెండా ప్రదర్శనలు వంటి కార్యక్రమాలను అనుమతించబోమని లోకేశ్ స్పష్టంగా తెలియజేశారు. ఇక నుంచి ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు ఇవ్వకుండా, పూర్తిగా బోధనపైనే దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగుపడేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 'కలలకు రెక్కలు' పథకాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. అలాగే కళాశాలల్లో ఆత్మహత్యల నివారణ కోసం ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26న పాఠశాల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి హెచ్చరించారు. విద్యా రంగంలో నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు.

# రెండో టెస్టు నుంచి గిల్ ఔట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



గువాహటి వేదికగా శనివారం నుంచి టీమిండియా , దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడనొప్పితో మైదానాన్ని వీడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతన్ని జట్టు నుంచి రిలీజ్ చేశారు. దీంతో గిల్ శుక్రవారమే ముంబయికి పయనమయ్యాడు. అతడు మొదట జట్టుతోపాటు గువాహటికి చేరుకున్నప్పటికీ ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు. అతడు ముంబయిలో కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న తర్వాత మరోసారి వైద్యులను సంప్రదించనున్నాడు. అయితే అతన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపే విషయమై ఇప్పటివరకైతే బీసీసీఐ ఏ నిర్ణయమూ తీసుకోలేదు. మరికొన్ని రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. గిల్ గైర్హాజరీలో రిషభ్‌పంత్ టీమిండియాకు సారథ్యం వహించనున్నాడు. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 01తో వెనకబడి ఉంది. కోల్‌కతా టెస్ట్‌లో 124 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించలేక భారత జట్టు 93 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆ మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో పరాజయం పాలు కావొద్దంటే, భారత జట్టు కచ్చితంగా రెండో టెస్ట్ మ్యాచ్‌లో గెలవాల్సిందే.

# కెప్టెన్‌గా శార్దూల్ ఠాకూర్..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**





నవంబర్ 26నుంచి ప్రారంభం కాబోయే దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ కోసం 17 మంది సభ్యుల ముంబై జట్టును శుక్రవారం ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా శార్దూల్ ఠాకూర్ ఎంపికయ్యాడు. ఇవాళ ఉదయం నుంచి సోషల్‌మీడియాలో ఓ వార్త హల్‌చల్ చేసింది. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ముంబై కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఎంపికయ్యాడని జోరుగా ప్రచారం జరిగింది. ముంబై క్రికెట్ అసోసియేషన్ అధికారిక ప్రకటనతో ఈ వార్త అబద్ధం అని తేలిపోయింది. అయితే సూర్యకుమార్ సాధారణ ఆటగాడిగా జట్టులో చోటు దక్కించుకున్నాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ నేపథ్యంలో అతను కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటాడు. ఎస్ఎంఏటీ సౌతాఫ్రికా సిరీస్ షెడ్యూల్స్ క్లాష్ అవుతున్నాయి. శార్దూల్ ఇటీవలే ముంబై రంజీ జట్టుకు కూడా కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వెటరన్ అజింక్య రహానే నుంచి బాధ్యతలు చేపట్టాడు. వాస్తవానికి ఎస్ఎంఏటీ లో ముంబై జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించాల్సి ఉండింది. అయితే అతను ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడటంతో అందుబాటులో లేకుండా పోయాడు. ఈ నేపథ్యంలో శార్దూల్‌కు కెప్టెన్సీ హోదా దక్కింది. రానున్న ఎస్ఎంఏటీ ఎడిషన్‌లో ముంబై డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది. గత ఎడిషన్ ఫైనల్లో శ్రేయస్ నేతృత్వంలోని ముంబై జట్టు మధ్యప్రదేశ్‌ను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. రానున్న సీజన్ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో చాలామంది టీమిండియా ఆటగాళ్లకు చోటు దక్కింది. కెప్టెన్ శార్దూల్, భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పాటు టీ20 స్టార్ శివమ్ దూబే, వెటరన్ అజింక్య రహానే, యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, అప్‌కమింగ్ స్టార్ ఆయుశ్ మాత్రే ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఫస్ట్ ఛాయిస్ వికెట్‌కీపర్ బ్యాటర్‌గా అండర్ 19 స్టార్ అంగ్‌క్రిష్ రఘువంశీ ఎంపికయ్యాడు. ఈ టోర్నీలో ముంబై ప్రయాణం నవంబర్ 26న రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌తో మొదలవుతుంది. ఈ మ్యాచ్ లక్నోలోని ఎకానా స్టేడియంలో జరుగనుంది.

**ఎస్ఎంఏటీ 2025-26 కోసం ముంబై జట్టు:** శార్దూల్ ఠాకూర్ (కెప్టెన్), అజింక్య రహానే, ఆయుశ్ మాత్రే, అంగ్‌క్రిష్ రఘువంశీ (వికెట్‌కీపర్), సూర్యకుమార్ యాదవ్, సిద్దేష్ లాడ్, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, సాయిరాజ్ పాటిల్, ముషీర్ ఖాన్, సూర్యాంశ్ షెడ్గే, అథర్వ అంకోలేకర్, తనుష్ కోటియన్, షమ్స్ ములానీ, తుషార్ దేశ్‌పాండే, ఇర్ఫాన్ ఉమైర్, హార్దిక్ తామోర్ (వికెట్‌కీపర్).

# బైకులన్నింటికీ ఏబీఎస్ తప్పనిసరి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ద్విచక్ర వాహనాల్లో 'యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్)'ను తప్పనిసరి చేసే గడువును కేంద్ర ప్రభుత్వం మరికొంత కాలం పొడిగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జూన్‌లో ప్రతిపాదించిన కొత్త నిబంధన ప్రకారం 2026 జనవరి 1వ తేదీ నుంచే అన్ని బైకులకు ఏబీఎస్ తప్పనిసరి చేయాలనే సూచన ఇచ్చింది. దీనిపై వివిధ తయారీ సంస్థల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించి, పలు దఫాల్లో చర్చలు నిర్వహించింది. తయారీ కంపెనీలు చాలా తక్కువ సమయంలో కొత్త వనరులు, అవసరమైన సాంకేతిక సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం సాధ్యం కాదని స్పష్టంగా తెలియజేశాయి. కనీసం ఒక సంవత్సరం అదనపు గడువు ఇవ్వాలని కోరడంతో, గడువు పొడిగింపు దిశగా కేంద్రం ఆలోచిస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 125సీసీకి పైబడిన బైకులకు మాత్రమే ABS తప్పనిసరి కాగా, మిగిలిన వాటిలో కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టమ్ అమల్లో ఉంది. ABS తప్పనిసరి చేస్తే వాహన ధరలు పెరగాల్సిందేనని కంపెనీలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా 125సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్న బైకుల విభాగం ధరల విషయంలో అత్యంత సెన్సిటివ్‌గా ఉంటుందని, ధరల్లో చిన్న పెరుగుదల కూడా అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఇంకా చిన్న బైకుల్లో ABS పనితీరు భారత రోడ్ల పరిస్థితులకు ఎంతవరకు అనుకూలం అవుతుందో కూడా తయారీదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న సరిపోతుందని,ఏబీఎస్ అవసరాన్ని సాంకేతికంగా మరోసారి పరిశీలించాలని సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏబీఎస్ అనుసంధానంపై టెక్నికల్ అంశాలను పరిశీలించేందుకు 'ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ను ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఏబీఎస్ (యాంటీ లాక్ (బ్రేకింగ్ సిస్టమ్) వాహనాల్లో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో చక్రాలు లాక్ అవకుండా నిరోధిస్తుంది. దీనివల్ల వాహనం స్కిడ్ కాకుండా డ్రైవర్‌కు నియంత్రణ కొనసాగుతుండటంతో ప్రమాదాల ప్రమాదం తగ్గుతుంది. ఈ భద్రతా సాంకేతికతను చిన్న బైకుల్లో తప్పనిసరి చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనపై తుది నిర్ణయం త్వరలో వెలువడనుంది.

# ఏడాది దాటితే గ్రాట్యుటీ..


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




ఉద్యోగుల సంక్షేమం, భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అమల్లో ఉన్న పాత 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, వాటి స్థానంలో నాలుగు కొత్త కార్మిక స్మృతులను రూపొందించిన కేంద్రం, వాటిని శుక్రవారం నోటిఫై చేస్తూ తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త స్మృతులు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సమాన వేతనాలు, మహిళా సాధికారత, అసంఘటిత రంగ కార్మికుల రక్షణకు బలమైన పునాది వేస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఇకపై అన్ని యజమానులు ఉద్యోగులకు లిఖిత పూర్వక నియామక పత్రం తప్పనిసరిగా ఇవ్వాలి. దీతో ఉపాధిలో పారదర్శకత పెరగడంతో పాటు స్థిరత్వానికి హామీ లభించనుంది. గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్లను కూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువచ్చి పీఎఫ్ , ఈఎస్ఐసీ , బీమా వంటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ముందుగా ఉన్న ఐదేళ్ల సేవా పరిమితిని తగ్గించి, కేవలం ఒక సంవత్సరం పూర్తి చేసిన తర్వాతే గ్రాట్యుటీ అర్హత కల్పించారు. దేశంలోని అన్ని రంగాల కార్మికులకు కనీస వేతన హక్కును చట్టబద్ధం చేస్తూ, యజమానులు సకాలంలో వేతనాలు చెల్లించడం తప్పనిసరి చేశారు. ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగులకు నెలలో ఏడో తేదీలోపు వేతనం చెల్లించాలి. బీడీ, సిగరెట్, మైనింగ్ రంగాల్లో పనిచేసేవారికి రోజుకు 8-12 గంటలపాటు పనిచేసే అనుమతిని ఇచ్చినా, వారానికి 48 గంటలు మించకూడదన్న షరతు విధించారు. అలాగే 30 రోజుల పని పూర్తిచేస్తే బోనస్‌కు అర్హులవుతారు. 40 ఏళ్లు పైబడిన ఉద్యోగులందరికీ యాజమాన్యం ఉచిత వార్షిక వైద్య పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి చేశారు. 'సమాన పనికి సమాన వేతనం' నిబంధనను బలపరుస్తూ, ట్రాన్స్‌జెండర్ సహా ఏ లింగం మీదైనా వివక్షను చట్టబద్ధంగా నిషేధించారు. నిర్ణీత పని గంటలకు మించి పనిచేస్తే రెట్టింపు వేతనం చెల్లించాలి. అదనంగా, రాత్రి షిఫ్టులలో పని చేయాలనుకునే మహిళలకు అనుమతి ఇచ్చారు. ఇందుకోసం అవసరమైన భద్రతా చర్యలు, వారి సమ్మతి తప్పనిసరి. మహిళా ఉద్యోగుల కుటుంబ పరిధిలో అత్తమామలను కూడా చేర్చి 'డిపెండెంట్ కవరేజ్'ను విస్తరించారు. దేశంలో తొలిసారిగా గిగ్ వర్క్, ప్లాట్‌ఫామ్ వర్క్ మరియు అగ్రిగేటర్లకు స్పష్టమైన నిర్వచనాలు చట్టంలో చేర్చబడ్డాయి. ఉబెర్, స్విగ్గీ వంటి అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం లేదా కార్మికులకు చెల్లించే మొత్తంలో 5 శాతం వరకు సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి చేశారు. ఆధార్‌తో అనుసంధానమైన యూనివర్సల్ అకౌంట్ నంబర్ ద్వారా ఉద్యోగులు ఏ రాష్ట్రానికి వలసవెళ్లినా సామాజిక భద్రత ప్రయోజనాలు పూర్తిగా పోర్టబుల్‌గా ఉంటాయని కేంద్రం పేర్కొంది.

# హాస్పిటాలిటీ రంగంలోకి మహీంద్రా...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



దిగ్గజ వ్యాపార సంస్థ మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ సంస్థ తాజాగా లీజర్ హాస్పిటాలిటీ రంగంలో ప్రవేశానికి రంగం సిద్ధం చేసింది. మహీంద్రా సిగ్నేచర్ రిసార్ట్స్ బ్రాండ్ పేరుతో లీజర్ హాస్పిటాలిటీ సేవల కోసం రూ.1000 కోట్ల పెట్టుబడులతో ముందుకు వచ్చింది. హాలిడే ఆతిథ్య రంగంలో ప్రవేశించడం ద్వారా లగ్జరీ ఆతిథ్య సేవలను అందించనుంది. మహీంద్రా సిగ్నేచర్ రిసార్ట్ తో మొదలుపెట్టనుంది. ఈ విభాగంలో 2030 నాటికల్లా 10 వేల గదులకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిద్వారా టూరిజం రంగంలో తమ బిజినెస్ పోర్ట్ ఫోలియోను మరింత విస్తరించనున్నట్లు మహీంద్రా హాలిడేస్ పేర్కొంది. దేశీయంగా ప్రజలు సెలవుదినాల కోసం సంప్రదాయ టూరిజం కాకుండా మరింత ఆకర్షణీయ ప్రయాణాలు, అనుభూతులు కోరుకుంటున్నారని మహీంద్రా హాలిడేస్ ఎండీ సీఈవో మనోజ్ భట్ తెలిపారు. దీనికోసం క్లబ్ మహీంద్రాను క్లబ్ ఎం గా పేరు పెడుతున్నట్లు తెలిపారు.

## భర్త పెన్షన్ తో
# భార్య లోన్ కు సంబంధం లేదు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




ఒడిశా హైకోర్టు లోన్ రికవరీ విషయంలో కీలక తీర్పు వెలువరించింది. భార్య లోన్ పేమెంట్స్ చేయకపోవడంతో జాయింట్ అకౌంట్‌లో ఉన్న భర్త పెన్షన్ డబ్బుల నుంచి బ్యాంకుకు రికవరీ చేసుకునే అధికారం లేదని తీర్పు ఇచ్చింది. మంచేశ్వర్‌లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగి శ్రీ మల్లిక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో భార్యతో కలిసి జాయింట్ అకౌంట్ కలిగి ఉన్నాడు. రిటైర్డ్ అయిన తర్వాత ఆయనకు నెలవారీ పెన్షన్ దాదాపు రూ. 35 వేలు ఈ బ్యాంక్ అకౌంట్లోకి వస్తుంది. ఆయన భార్య పలు లోన్స్ అదే బ్యాంకులో తీసుకుంది. దీనికి భర్త మల్లిక్ హామీదారుడిగా ఉన్నాడు. అయితే రెండు ట్రాన్స్ పోర్ట్ వాహనాలకు సంబంధించి ఆమె లోన్ తిరిగి కట్టలేదు. దీంతో బ్యాంకు వాటిని డీఫాల్ట్ జాబితాలో చేర్చింది. ఈ క్రమంలో భార్యభర్తలు కలిసి తీసుకున్న జాయింట్ అకౌంట్ నుంచి రెండు సార్లుగా దాదాపు రూ.5 లక్షలు డెబిట్ అయ్యాయి. దీనితో మల్లిక్ బ్యాంకును సంప్రదించాడు. తాను హామీదారుడిని మాత్రమేనని, తన అనుమతి లేకుండా డబ్బులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించాడు. అవి తన పెన్షన్ డబ్బులని, తన కూతురి పెళ్లి కోసం వాటిని తిరిగి తన అకౌంట్లో జమ చేయాలని బ్యాంకును కోరగా వారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. దీనితో మల్లిక్ ఒడిశా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిని విచారించిన కోర్టు..పెన్షన్ డబ్బులు తీసుకోవడం సరికాదని ఆదేశించింది. డబ్బులు తిరిగి అతడికి ఇవ్వాలని తీర్పునిచ్చింది.



## క్వార్టర్స్ లో ఓడిన
# తండ్రీ కొడుకులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


ఆస్ట్రేలియా టెన్నిస్ దిగ్గజం, గ్రాండ్‌స్లామ్ మాజీ చాంపియన్ లీటన్ హెవిట్ తన రిటైర్మెంట్‌ను పక్కనబెట్టి మరోసారి కోర్టులో రాణించేందుకు ప్రయత్నించినా, క్వార్టర్ ఫైనల్ దశలో నిలిచిపోయాడు. న్యూసౌత్‌వేల్స్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో 44 ఏళ్ల హెవిట్ తన 16 ఏళ్ల కుమారుడు క్రూజ్‌తో జతకట్టి డబుల్స్ విభాగంలో పోటీపడ్డాడు. తండ్రీ-తనయుల ఈ జోడీ తొలి మ్యాచ్‌లోనే శుభారంభం చేసి టెన్నిస్ అభిమానులను ఆకట్టుకుంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మాత్రం హెవిట్-క్రూజ్ ద్వయం ఓటమి చవిచూసింది. డేన్ స్వీని-కలం పుటెర్‌గిల్ జంట 5-7, 4-6తో తండ్రీతనయులపై విజయం సాధిస్తూ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కీలక పాయింట్ల వద్ద ప్రతిస్పందనలో కొద్దిపాటి లోపాలు తండ్రీతనయుల జోడీకి చేటయ్యాయి. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌లో హెవిట్-క్రూజ్ 6-1, 6-0తో హేడెన్ జోన్స్-పావ్‌లె మారినకొవ్ జంటను చిత్తు చేసి చురుకైన ఆటతీరుతో దృష్టిని ఆకర్షించారు. తండ్రి అనుభవం, కుమారుడు క్రూజ్ వేగం... రెండూ కలిసి ఆసీస్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి రేపాయి. 2001లో యూఎస్ ఓపెన్, 2002లో వింబుల్డన్ సింగిల్స్ టైటిళ్లను సాధించిన హెవిట్ ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్ స్థానాన్ని అధిరోహించాడు. ఆస్ట్రేలియా డేవిస్ కప్ కెప్టెన్‌గా కూడా పనిచేసిన ఆయన 2016లో ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అయ్యాడు. దాదాపు దశాబ్దం తర్వాత కోర్టులోకి అడుగుపెట్టిన హెవిట్ తన కుమారుడితో కలిసి ఆడటమే ఈ టోర్నమెంట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 2005లో ఆస్ట్రేలియాలోని ప్రముఖ నటి బెక్ కార్ట్‌రైట్‌ను హెవిట్ వివాహమాడాడు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. ఇప్పుడు వారిలో క్రూజ్ టెన్నిస్ వైపు అడుగులు వేస్తుండగా, తండ్రి-కుమారుడి జోడీ కోర్టులో కనిపించడం అభిమానులకు అదనపు సందడి కలిగించింది.

## నిరాశ పర్చిన
# ఫుజియామా పవర్ సిస్టమ్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**





ఇంటి పైకప్పు సౌర ఉత్పత్తుల తయారీ సంస్థ ఫుజియామా పవర్ సిస్టమ్స్ షేర్ మార్కెట్ లిస్టింగ్లో ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. కంపెనీ షేర్ బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.228తో పోలిస్తే 4% డిస్కౌంటుతో రూ.218 వద్ద ప్రారంభమైంది.లిస్టింగ్ తర్వాత షేర్ ధర మరింతగా ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 10% క్షీణించి రూ.205 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరకు షేర్ 9% నష్టంతో రూ.208 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసే సమయానికి ఫుజియామా పవర్ సిస్టమ్స్ మార్కెట్ విలువ రూ.6,384 కోట్లుగా ఉందని ఎక్స్ఛేంజ్ డేటా వెల్లడించింది.



# ఫోన్‌పే దే హవా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ లోని యూపీఐ చెల్లింపులలో ఫోన్ పే యాప్ హవా కొనసాగుతోంది. దేశం మొత్తంలో కేవలం ఫోన్ పే, గూగుల్ పే మాత్రమే 80 శాతానికి పైగా మార్కెట్ షేర్ ను కలిగి ఉండడం విశేషం. ఏకంగా 45.47 శాతంలో ఫోన్ పే టాప్ లో ఉండగా, గూగుల్ పే 34.6 శాతం కలిగి ఉంది. తర్వాత స్థానాలలో పేటీఎం, నవీ, సూపర్ మనీ, బీహెచ్ఐఎం, క్రెడ్ వంటి ప్లాట్ ఫామ్స్ ఉన్నాయి.




# పుతిన్ ఎదుట రోబో డ్యాన్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచమంతా టెక్నాలజీతో పోటీ పడుతోంది. ఏఐ టెక్నాలజీ, హ్యూమనాయిడ్ రోబోల తయారీలో ప్రతీ దేశం ముందంజలో ఉండాలని ప్రయత్నిస్తోంది. తాజాగా రష్యా కూడా హ్యూమనాయిడ్ రోబోను తయారు చేసింది. ఈ రోబో అధ్యక్షుడు వ్యాదిమిర్ పుతిన్ ఎదుట డ్యాన్స్ చేసింది. బుధవారం స్బేర్ బ్యాంక్ లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒక రోబో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నా పేరు గ్రీన్. నేను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలిగిన మొదటి రష్యన్ హ్యూమనాయిడ్ రోబోట్ ను అంటూ పుతిన్ తో పరిచయం చేసుకుంది. నేను కేవలం ప్రోగ్రామ్ కాదు. డ్యాన్స్ కూడా చేయగలను అంటూ డ్యాన్స్ చేసి, ఆయనను మెప్పించింది.



## స్మృతి మంధానకు
# సర్ ప్రైజ్ ప్రపోజల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు ఆమె బాయ్ ఫ్రెండ్ ప్రముఖ మ్యూజిక్ డైరక్టర్ పలాష్ ముచ్చల్ సర్ ప్రైజ్ గా ప్రపోజ్ చేశారు. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత మహిళా జట్టు ఇటీవల 2025 వరల్డ్ కప్ టైటిల్ ను గెలిచి చరిత్ర సృష్టించింది. సరిగ్గా అదే మైదానంలో పలాష్, స్మృతి మంధానను నన్ను పెళ్లి చేసుకుంటావా? అని అడుగుతూ సర్ ప్రైజ్ చేశారు. ఈ రొమాంటిక్ మూమెంట్ కు సంబంధించిన వీడియోను పలాష్ స్వయంగా తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, అది కాస్తా ఫ్యాన్స్ మధ్య తెగ వైరల్ అవుతోంది. మంధాన కూడా తన ఎంగేజ్‌మెంట్ రింగ్ ను చూపించిన ఒక ఫన్నీ వీడియోను తన టీమ్ మేట్స్ తో కలిసి షేర్ చేసింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ తో స్మృతి వివాహం నవంబర్ 23న జరగనుంది. వీరు చాలా ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల జరిగిన మహిళా వరల్డ్ కప్ 2025 సందర్భంగా కూడా పలాష్ గ్రౌండ్‌లో ఉండి స్మృతి మంధానకు మద్దతు పలికారు. టీమిండియా వరల్డ్ కప్ గెలిచినప్పుడు, వీరిద్దరూ కలిసి ఆ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు.



# 'ఫుడ్ ఆన్ ట్రైన్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తన 'ఫుడ్ ఆన్ ట్రైన్' సేవలను విస్తరించింది. దేశవ్యాప్తంగా మొత్తం 122 రైల్వే స్టేషన్లలో ఈ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. ప్రయాణికుల నుంచి భారీ స్పందన లభించడంతో మరిన్ని స్టేషన్లకు సేవలను విస్తరించామని స్విగ్గీ తెలిపింది. ఇప్పటి వరకు ప్రయాణానికి 24 గంటల ముందు మాత్రమే లభించిన ప్రీఆర్డర్ సదుపాయాన్ని ఇప్పుడు 96 గంటలకు (4 రోజులు) పెంచింది. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకుని, తమకు నచ్చిన ఆహారాన్ని ముందస్తుగా ఆర్డర్ చేసుకునే అవకాశం కలుగుతుందని స్విగ్గీ పేర్కొంది. కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, తమిళనాడులో మధురై, రాజస్థాన్‌లో అల్వార్, కేరళలో కోజికోడ్, ఒడిశాలో ఖుర్దా రోడ్, కర్ణాటకలో యశ్వంత్‌పుర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో గోండా వంటి అనేక స్టేషన్లను సేవల జాబితాలో చేర్చారు. ఇటీవల పండగ సీజన్‌లో ప్రయాణికులు ఈ సేవకు మంచి ఆదరణ చూపినట్లు సంస్థ వెల్లడించింది."మా 'ఫుడ్ ఆన్ ట్రైన్' సేవలను 122 స్టేషన్లకు విస్తరించడం, ప్రీబుకింగ్ విండోను 4 రోజులకు పెంచడం ద్వారా ప్రయాణికులు స్థానిక రుచులను ముందుగానే ఆర్డర్ చేసుకుని ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చు," అని స్విగ్గీ ఫుడ్ స్ట్రాటజీ, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, కొత్త ఆవిష్కరణల వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలో ఓ ప్రకటనలో తెలిపారు.




# 'మెటా'కు గుడ్ బై

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఏఐ గాడ్ ఫాదర్ గా పిలుచుకునే ప్రముఖ కంప్యూటర్ సైంటిస్ట్ యాన్ లెకున్ తాజాగా మెటా నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తన సొంత ఏఐ స్టార్టప్ ను ప్రారంభించేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన లింక్డిన్ పోస్ట్ లో వెల్లడించారు. 65 ఏళ్ల యాన్ లెకున్ గత 12 ఏళ్లుగా మెటాలోనే పనిచేస్తున్నారు. ఫేస్ బుక్ ఏఐ రీసెర్చ్ వ్యవస్థాపక డైరక్టర్ గా 5 సంవత్సరాలు, చీఫ్ ఏఐ సైంటిస్ట్ గా 7 సంవత్సరాలు పని చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఆయన సంస్థను విడిచిపెట్టి వెళ్లిపోవడం గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ఏఐ ఉత్పత్తులు, వాణిజ్య ప్రాజెక్టులపై మరింత దృష్టి పెట్టడానికి మెటా ఇటీవల పునర్వ్యవస్థీకరించిన బృందాల విషయంలో లెకున్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ ద్వారా ఒకప్పుడు మెటాలో ప్రధాన ఏఐ శాస్త్రవేత్తగా లెకున్ అనుభవించిన స్వతంత్ర్యం తగ్గిపోయిందనే వాదనలు ఉన్నాయి. ప్రస్తుతం తన సొంత ఏఐ స్టార్టప్ మెషిన్ 'అడ్వాన్స్ మెషిన్ ఇంటెలిజెన్స్' అనే సంస్థను స్థాపించబోతున్నట్లు తెలిపారు.


మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
22.11.2025
www.manasarkar.com



## నిర్మాతగా బాలీవుడ్ లోకి..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

నటుడిగా, నిర్మాతగా రానా జోరు పెంచాడు. హీరో పాత్రలకు గుడ్ బై చెప్పి కొంతకాలంగా సహాయ పాత్రలతో ముందుకు సాగుతున్నాడు దగ్గుబాటి రానా. అంతే కాదు... 2005లో తన సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియాను ప్రారంభించి, కంటెంట్ డెవలప్ మెంట్, చిత్ర నిర్మాణం, పంపిణీ కార్యక్రమాలను చేస్తున్నాడు. అలానే టాలెంట్ మేనేజ్ మెంట్, బ్రాండ్ మార్కెటింగ్ వ్యవహారాలను స్పిరిట్ మీడియా పర్యవేక్షిస్తుంటుంది. ఇక రానా తనకు నచ్చిన మీడియమ్ అండ్ లో బడ్జెట్ చిత్రాలను విడుదల చేస్తూ నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తున్నాడు. హిందీ చిత్రసీమలోకి 2011లో 'దమ్మారో దమ్' మూవీతో అడుగుపెట్టిన రానా అప్పటి నుండి పలు హిందీ చిత్రాలలో నటించాడు. అయితే ఇప్పుడు తొలిసారి నిర్మాతగానూ అతను బాలీవుడ్ లో తన అదృష్టం పరీక్షించుకోబోతున్నాడు. బూకర్ ప్రైజ్ విన్నింగ్ రైటర్ అరవింద్ అడిగ రాసిన 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్' నవల ఆధారంగా రానా ఓ సినిమాను హిందీలో నిర్మించబోతున్నాడు. బెన్ రేఖీ దర్శకత్వం వహించే ఈ సినిమాలో ప్రముఖ నటుడు మనోజ్ బాజ్ పాయ్ ఓ కీలక పాత్రను చేయబోతున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుతం రానా... దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన 'కాంత'తో పాటు 'డార్క్ చాక్లెట్, సైక్ సిద్ధార్థ్', 'ప్రేమంటే' ప్రాజెక్ట్స్ కు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించాడు.



## హాట్ టాపిక్‌గా నాగ చైతన్య మేకింగ్ వీడియో..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

యువ సామ్రాట్ నాగ చైతన్య నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ ఎన్.సి24తో థ్రిల్ చేయబోతున్నారు. ఈ చిత్రానికి విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్.ఎల్.పి (ఎస్.వి.సి.సి), సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. లాపతా లేడీస్ ఫేమ్ స్పార్ష్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా మేకర్స్ తాజాగా విడుదల చేసిన స్ట్రైకింగ్ అండ్ ఇమర్సివ్ బి.టి.ఎస్ మేకింగ్ వీడియో సినిమా భారీ స్కేల్, విజన్, అంబిషన్‌ను చూపించింది. విడుదలైన వెంటనే ఈ గ్లింప్స్ ఇంటర్నెట్ లో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా కోసం జరుగుతున్న కృషి, క్రియేటివ్ వర్క్ అద్భుతంగా కనిపిస్తోంది. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర కుమార్ తంగాల ఎకరాల విస్తీర్ణంలో వందలాది టెక్నీషియన్స్ కష్టపడి నిర్మించిన భారీ సెట్ విజువల్ ఎక్స్ లెన్స్ ను ప్రతిబింబిస్తోంది. వీడియోలో నాగ చైతన్య ఫిజికల్, యాక్షన్ ట్రైనింగ్ కట్టిపడేసింది. ఇంటర్నేషనల్ యాక్షన్ కొరియోగ్రాఫర్ జుజి మాస్టర్ పర్యవేక్షణలో ఆయన చేసిన ట్రైనింగ్, పాత్ర కోసం తీసుకున్న ట్రాన్స్ ఫర్మేషన్ అద్భుతంగా వున్నాయి. మేకింగ్ గ్లింప్స్ లో అనేకమంది ఆర్టిస్టులు, పెర్ఫార్మర్లు పాల్గొన్న భారీ సీన్స్ ఆకట్టుకున్నాయి. సినిమా ఎలాంటి ఎపిక్ కాన్వాస్ మీద తీర్చిదిద్దబడుతోందో స్పష్టమవుతుంది. అజనీష్ లోకనాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మ్యూజిక్ వీడియోకు మరింత మిస్టరీ, ఇంటెన్సిటీని జోడించి, సినిమా ఏ రకం ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తుందో ముందుగానే అనుభూతి కలిగిస్తోంది. నవంబర్ 23న నాగ చైతన్య బర్త్ డే సందర్భంగా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ అప్‌డేట్ ఇప్పటికే అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న రివీల్స్ లో ఒకటిగా మారింది. గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్, ఆసక్తికరమైన కాన్సెప్ట్, పవర్‌ఫుల్ టెక్నికల్ టీమ్, డెడికేటెడ్ లీడ్ క్యాస్ట్‌తో, ఎన్.సి24 మిథికల్ థ్రిల్లర్ జానర్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లే ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. నాగ చైతన్య కెరీర్‌లో అత్యంత భారీ, అంబిషస్, హై బడ్జెట్ సినిమాల్లో ఎన్.సి24 ఒకటిగా నిలుస్తోంది. మిథ్‌కు రూటెడ్ థ్రిల్లర్‌గా, యూనిక్ నారేటివ్ ఫ్రేమ్‌వర్క్, హై ఇంటెన్సిటీ స్టోరీటెల్లింగ్‌తో మునుపెన్నడూ లేని అనుభూతిని అందించబోతోంది.

# నా కెరీర్ లో ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే...

**హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో ఇంటర్వ్యూ ...**



**ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. హై-ఆక్టేన్ ఎనర్జీ, రొమాన్స్, అభిమానులతో కూడిన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్-స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ - మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది, నాలుగు పాటలు చార్ట్ బస్టర్‌లుగా మారాయి. ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం ఈ నెల 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే 'మన సర్కార్'తో సినిమా విశేషాలు పంచుకున్నారు.**

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

**ముందుగా కంగ్రాట్యులేషన్స్.. 'కాంత' సినిమాకి, మీ పెర్ఫార్మన్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఎలా అనిపించింది?**

చాలా ఆనందంగా అనిపించింది. ప్రేక్షకులు నటిగా నాలో ఉన్న పొటెన్షియల్ చూశారు. చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. నా కెరీర్ లో ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే.

**'ఆంధ్ర కింగ్'లో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

'ఆంధ్ర కింగ్' లో నేను మహాలక్ష్మి క్యారెక్టర్ లో కనిపిస్తాను. తను కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్ తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథలో తన క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. ఈ క్యారెక్టర్ ఆడియన్స్ గుర్తు పెట్టుకునేలా వుంటుంది.

**మహేష్ గారు ఈ కథ చెబుతున్నప్పుడు మీకు నచ్చిన ఎలిమెంట్స్ ఏమిటి?**

అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ అభిమానుల ఆదరణ చూసిన తర్వాత ఒక స్టార్ ని ఇంత గొప్పగా ఆరాధిస్తారో ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశాను. అది నిజంగా చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారు అనిపించేది. మహేష్ ఈ కథ చెప్పిన తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.

**ఉపేంద్ర గారితో మీకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయా?**

ఒక కాంబినేషన్ సీన్ ఉంది. ఆయన వెరీ హంబుల్ యాక్టర్. చాలా డౌట్ టు ఎర్త్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

**సాగర్ మహాలక్ష్మి లవ్ స్టోరీ ఎంత కొత్తగా ఉండబోతుంది?**

ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉండబోతుంది. నువ్వుంటే చాలు, చిన్ని గుండెలో పాటలు మీరు చూసే ఉంటారు. ప్రేమలో ఉన్న గొప్ప ఎమోషన్ ఇందులో ఉంటుంది.

**హీరో రామ్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

రామ్ గారితో నటించడం అమేజింగ్ ఎక్స్ పరియన్స్. వెరీ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఆయన ఎనర్జీ మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్ గా ఉంటాయి. రామ్ గారు చాలా పాజిటివ్ గా ఉంటారు.

**ఈ సినిమాలో మీకు ఫేవరెట్ సాంగ్ ఏంటి?**

సినిమా ఆల్బమ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలన్నీ ఇష్టం. అయితే నాకు ఫేవరెట్ నువ్వుంటే చాలు.

**ఇది పిరియడ్ సినిమా కదా కాస్ట్యూమ్స్ పరంగా ఎలాంటి కేర్ తీసుకున్నారు?**

ఇది 2000లో జరిగే కథ. డైరెక్టర్ గారు కాస్ట్యూమ్స్, ఆర్ట్ వర్క్ అన్నింటి పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.

**ఇందులో మీకు చాలెంజింగ్ గా అనిపించినా సీక్వెన్స్ ఉందా?**

ఇందులో ఒక ఇంపార్టెంట్ సీన్ ఉంది. డైరెక్టర్ గారు వివరించారు. నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని డైరెక్టర్ గారికి రిక్వెస్ట్ చేశాను. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది.

**మైత్రి మూవీ మేకర్స్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

రవి నవీన్ గారు నేను కలిసిన ఫస్ట్ ప్రొడ్యూసర్స్. వాళ్లతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో ఉంది. ఈ సినిమాతో వారితో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. చాలా పాషన్ ప్రొడ్యూసర్స్. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని తీశారు.

**షూటింగ్ ఎక్స్ పరియన్స్ గురించి?**

ఒక షెడ్యూల్ కోసం రాజమండ్రి వెళ్ళాం. అక్కడ చాలా వేడిగా ఉంది. అయితే ఒక టీం గా సినిమా కోసం వర్క్ చేయడంలో చాలా ఎంజాయ్ చేశాం. ఈ సినిమాలో తులసి, రావు రమేష్, మురళి శర్మ గారు ఇలా అద్భుతమైన యాక్టర్స్ ఉన్నారు. వాళ్ళందరి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. రావు రమేష్ గారి పెర్ఫార్మన్స్ అద్భుతంగా ఉంటుంది. అలాగే రాహుల్ క్యారెక్టర్ కూడా చాలా బాగుంటుంది.

**మీరు ఎలాంటి క్యారెక్టర్స్ చేయాలనుకుంటున్నారు?**

నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. అయితే వచ్చిన ప్రతి క్యారెక్టర్ కి వంద శాతం ఇచ్చి ఒక వెర్సటైల్ యాక్ట్రెస్ గా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క గారు 'అరుంధతి'లో చేసినటువంటి క్యారెక్టర్స్ చాలా ఇష్టం. అలాంటి పాత్రలు నాకు వస్తాయని ఆశిస్తున్నాను.

**మీరు చేసిన రెండు సినిమాలకే చాలా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ వచ్చింది.. ఎలా అనిపిస్తోంది?**

ఇది ఒక అదృష్టంగా భావిస్తున్నాను. అందరికీ ఇలాంటి సపోర్టు ఉండదు. అందరూ కూడా తమ అమ్మాయిగా అభిమానాన్ని చూపించారు. ఇలాంటి అభిమానం గౌరవం ప్రేమ మరింత పొందాలని కోరుకుంటున్నాను.

-ఎం.డి అబ్దుల్



## సారా బాలీవుడ్ ఎంట్రీ..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

బాలనటిగా మెప్పించిన సారా అర్జున్ ఇప్పుడు హీరోయిన్ గా బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. 'దురంధర్' సినిమాలో రణవీర్ సింగ్ సరసన సారా నటించింది. అలానే ఆమె నటించిన తెలుగు సినిమా 'యుఫోరియా' సైతం జనం ముందుకు రాబోతోంది. సారా అర్జున్ అనగానే తెలుగువారికి ఠక్కున గుర్తొచ్చే సినిమా విక్రమ్ నటించిన తమిళ అనువాద చిత్రం 'నాన్న'. తమిళంలో 'దైవ తిరుమగళ్' పేరుతో రూపుదిద్దుకున్న ఈ సినిమా బాలనటిగా సారా అర్జున్ కు మంచి పేరు తెచ్చిపెట్టింది. అప్పటి నుండి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించి, రాణించింది. ఆమె తండ్రి రాజ్ అర్జున్ నటుడు కావడంతో ఆమెకు ఫిల్మ్ ఎంట్రీ సులభతరమైంది. తమిళంతో పాటు హిందీలోనూ బాలనటిగా నటించి మెప్పించింది. తమిళంలో ఈ చిన్నారి నటించిన 'శైవం' సినిమా తెలుగులోనూ 'దాగుడు మూతల దండాకోర్' పేరుతో రీమేక్ అయ్యింది. ఇక్కడ కూడా తన పాత్రను సారా అర్జునే చేసింది. ఆపైన పలు చిత్రాలలో బాలనటిగా మెప్పించిన సారా యుక్త వయసులో మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్' రెండు భాగాల్లోనూ నటించింది. విశేషం... ఏమంటే ఈ యేడాది నాయికగా బాలీవుడ్ లోకి ఓ క్రేజీ ప్రాజెక్ట్ తో సారా అర్జున్ ఎంట్రీ ఇస్తోంది. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' మూవీతో డెబ్యూ డైరెక్టర్ గా జాతీయ అవార్డును అందుకున్న ఆదిత్య ధర్ తాజా చిత్రం 'దురంధర్'లో రణవీర్ సింగ్ సరసన సారా నటిస్తోంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదలైంది. ఈ ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ సారా సెంటర్ ఆఫ్ ది ఎట్రాక్షన్ గా నిలిచింది. డిసెంబర్ 5న సారా అర్జున్ నటించిన 'దురంధర్' విడుదల అవుతుంటే.... అదే నెల 25న ఆమె తెలుగులో నటించిన 'యుఫోరియా' మూవీ విడుదల కాబోతోంది. ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యుఫోరియా'లో భూమిక ప్రధాన పాత్ర పోషించగా, సారా అర్జున్ ఇందులో అత్యంత కీలకమైన పాత్రను చేసింది. పతాక సన్నివేశంలో సారా అర్జున్ స్క్రీన్ ప్రెజెన్స్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

## '666 ఆపరేషన్ డ్రీమ్'లో ప్రియాంక మోహన్

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

డాక్టర్ శివరాజ్ కుమార్, ధనంజయ ముఖ్య పాత్రలుగా హేమంత్ ఎం.రావు దర్శకత్వంలో వస్తోన్న సినిమా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ చిత్ర యూనిట్ ప్రియాంక మోహన్‌ను ఆన్‌బోర్డింగ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె ఇప్పుడు లెజెండరీ సూపర్ స్టార్ డాక్టర్ శివ రాజ్ కుమార్, బహుముఖ ప్రజ్ఞాశాలి ధనంజయ నేతృత్వంలోని '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' నక్షత్ర తారాగణంలో చేరింది. ప్రియాంక మోహన్ తమిళం, తెలుగు, కన్నడ సినిమాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. ఆమె సూపర్ స్టార్ పవన్ కళ్యాణ్, నాని, ధనుష్, శివ కార్తికేయన్‌లతో కలిసి నటించిన సంగతి తెలిసిందే. ఓజి, సరిపోద శనివారం, కెప్టెన్ మిల్లర్, డాక్టర్ తదితర అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలలో ప్రశంసలు పొందిన పాత్రలతో మెప్పించిన ప్రియాంక ఇప్పుడు హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహిస్తున్న బాండ్‌ఎస్క్యూ స్పై డ్రామాలో చేరింది. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ .. 80ల నేపథ్యంలో నేను డాక్టర్ శివ రాజ్ కుమార్ సార్ సినిమాలు చూస్తూ పెరిగాను. '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'లో భాగం కావడంతో నా కల నిజమైంది. అద్భుతమైన ప్రతిభావంతులైన ధనంజయతో కలిసి పనిచేయడం.. అలాంటి సమిష్టి తారాగణంలో భాగం కావడం మరపురాని అనుభూతి అని చెప్పుకొచ్చింది.



అలాగే హేమంత్ ఎం.రావుతో కలిసి పనిచేయడం నాకు అనుభవాన్ని నేర్పిస్తుంది. ఇంత త్వరగా నాకు ఈ అదృష్టం వరిస్తుందని అనుకోలేదు అని ఇటీవలే తన పుట్టినరోజు జరుపుకున్న ప్రియాంక మోహన్ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రియాంక మోహన్ లుక్‌ను విడుదల చేయడానికి బృందం సిద్ధంగా ఉంది. ఈ చిత్రం మూడవ షెడ్యూల్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' ఇప్పటికే రెండు షెడ్యూల్ల షూటింగ్ ను పూర్తి చేసింది. ధనంజయ డాక్టర్ శివ రాజ్‌కుమార్ ఇద్దరి ఫస్ట్ లుక్‌లు సినిమా పై అంచనాలను పెంచాయి.



## ట్రెండింగ్‌లోకి షారుఖ్ 'కింగ్' గ్లింప్స్

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

షారుఖ్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా వచ్చిన 'కింగ్' టైటిల్ గ్లింప్స్ కి అనూహ్య ఆదరణ లభించింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ సినిమా 2026లో భారీగా విడుదల కానుంది. నిమిషం 11 సెకండ్ల నిడివి గల ఈ 'కింగ్' టైటిల్ గ్లింప్స్ లో షారుఖ్ కొత్త లుక్‌లో కనిపించారు. బైక్స్ దూసుకెళ్లడం.. గన్ ఫైట్స్, ఫైర్ సీక్వెన్స్ లు, షారుఖ్ డైలాగ్ డెలివరీ అదిరిపోయాయి. ఈ వీడియో వచ్చిన క్షణాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. దీనిని చూసిన ఫ్యాన్స్ మాత్రం "ఇది కేవలం గ్లింప్స్ మాత్రమే.. ట్రైలర్ వస్తే మాస్ బ్లాస్ట్ గ్యారంటీ" అంటున్నారు. మరికొంతమంది షారుఖ్ లుక్ వరస్ట్ గా ఉందని, గ్లిమ్స్ పరమ రొటీన్‌గా ఉందని, ఆకట్టుకునేలా లేదని అనేక మంది పెదవి విరుస్తున్నారు. రెండేండ్ల క్రితం షారుఖ్‌తోనే 'పఠాన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ 'కింగ్' చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ఆరంభమవుతుందని, 2026 చివర్లో థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, స్టంట్ డిజైన్, మ్యూజిక్ - అన్ని విభాగాల్లోనూ పెద్ద బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా ఇది.



## మంచి కథల్ని చెప్పాలనే ప్రయత్నం..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

ప్రియదర్శి రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ 'ప్రేమంటే'. ఆనంది హీరోయిన్. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్ గా అరంగేట్రం. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పించింది. ఈ సినిమా టీజర్ ట్రైలర్ సాంగ్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా హీరో ప్రియదర్శి సినిమా విశేషాలు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.... ''ప్రతి సినిమాకి రిలీజ్ ముందు ఎక్సైట్‌మెంట్, నెర్వస్‌నెస్ ఉంటుంది. ఒక రైతు వాన కోసం ఎదురుచూసినట్టు నేను కూడా నా సినిమా రిజల్ట్ కోసం ఎదురుచూస్తుంటాను. 'ప్రేమంటే'చిత్రంలో ప్రేమంటే ఇంత బాగుంటుంది అని అనుకోవడం దగ్గరనుంచి ఇలా కూడా ఉంటుందని చూపించడం జరిగింది. సినిమా అందరూ రిలేట్ చేసుకునేలా వుంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి ఎమోషన్ ఉంటుంది. ఆనంది తమిళ్ లో చేసిన అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఉన్న సినిమాలు చూశాను. తను తెలుగమ్మాయి. వరంగల్ లో పుట్టి పెరిగిన అమ్మాయి. చాలా ప్రొఫెషనల్. అద్భుతమైన పెర్ఫార్మర్. దర్శకుడు నవనీత్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. తనకు ఏం కావాలో క్లారిటీ ఉన్న డైరెక్టర్. చాలా మెచ్యూరిటీతో ఈ కథ రాశాడు. పెళ్లి విడాకులు ఇవన్నీ కూడా చాలా సెన్సిటివ్ టాపిక్స్. ఇద్దరు తమ ప్రాబ్లం ని ఎలా పరిష్కరించుకున్నారు అనేది ఈ సినిమాలో చూపించాం. నా క్యారెక్టర్స్ కి నాకు సంబంధం ఉండదు. నాకున్న ఐడియాలజీల్ని నా క్యారెక్టర్స్ మీద రుద్ద దలుచుకోలేదు. నేను అనేవాడు లేకుండా నేను క్యారెక్టర్స్ లోకి ఎంటర్ కావాలి. అప్పుడే ఇలాంటి సినిమాలు, ప్రయోగాత్మక చిత్రాలు చేయగలను. నన్ను నేను వెనక్కి పెట్టుకుంటేనే కొత్త తరహా పాత్రలో చేయగలుగుతాను. మల్లేశం, బలగం, కోర్టు అలా వచ్చిన చిత్రాలే. ప్రస్తుతం నేను పొలిటికల్ థ్రిల్లర్ అసమర్థుడు సినిమా చేస్తున్నాను. అలాగే థ్రిల్లర్ జానర్ లో సుయోధన సినిమా చేస్తున్నాను. ఒక ప్రేక్షకుడిగా నేను చూడాలనుకున్న సినిమాల్ని మంచి కథల్ని చెప్పాలనే ప్రయత్నం చేస్తుంటాను. మన భాషా సంస్కృతి గొప్పవి. మన దగ్గర ఎన్నో అద్భుతమైన కథలు ఉన్నాయి. నేను కాస్త విలక్షణమైన కథలు చేస్తాననే గుర్తింపు ప్రేక్షకులు ఇచ్చారు. అ బాధ్యతతో ప్రేక్షకుల దగ్గర గౌరవం ప్రేమ గెలుచుకోవాలని సినిమాలు చేస్తున్నాను'' అంటూ ముగించారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**